RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

సంచిక : 21 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శుక్రవారం | 29-05-2026 | పేజీలు-8

**నీలగిరి నిత్యపద్యం**

ఆటవెలది

మొక్కపుట్టగానే మొగ్గలు వేయదు
నీరుపోసి పెంచ నిక్కముగను
పనులుమొదలుపెట్ట ఫలితములును రావు
నిత్యశ్రమలతోడ నీకునాకు

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

## ఎట్టకేలకు సిద్ధరామయ్య రాజీనామా




- గవర్నర్ కార్యదర్శికి రాజీనామా లేఖ అందచేత
- అధిష్టానం ఆదేశాల మేరకు వైదొలుగుతున్నట్లు ప్రకటన
- జాతీయ రాజకీయాలకు వెళ్లే ఆలోచన లేదని వెల్లడి

**బెంగళూరు, మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కర్నాటకానికి తెరపడింది. గతకొంతకాలంగా ఊహాగానాలతో సాగిన రాజకీయాలు మలుపు తిరిగాయి. కర్నాటకలో సిద్ధరామయ్య జమానా ముగిసింది. ఎట్టకేలకు కర్ణాటకలో నాయకత్వ మార్పు చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేశారు. గురువారం మధ్యాహ్నం

-మిగతా 2 లో

## రాబోయే ఐదేండ్లూ భగభగలే..



- రికార్డ్‌స్థాయిలో ఉష్ణోగ్రతలు
- సగటున 1.9 డిగ్రీల సెల్సియస్ మేర ఉష్ణోగ్రతలు పెరుగొచ్చు
- ప్రపంచ వాతావరణ సంస్థ వెల్లడి

**న్యూఢిల్లీ,మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాబోయే ఐదేండ్లలో ప్రపంచ సగటు ఉష్ణోగ్రతలు 1.9 డిగ్రీల సెల్సియస్ వరకు పెరుగవచ్చునని ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంవో) నివేదిక హెచ్చరించింది. ఉష్ణోగ్రతల పెరుగుదల 1.5 డిగ్రీల సెల్సియస్ దాటకుండా కట్టడి చేయాలన్నది 'పారిస్ ఒప్పందం' లక్ష్యం.

-మిగతా 2 లో

తెలుగుదేశం పార్టీ

### దేశంలోనే ధనిక ప్రాంతీయ

## పార్టీగా టీడీపీ..

- రూ. 228 కోట్ల ఆదాయంతో మొదటి స్థానం
- తర్వాత స్థానాల్లో తృణమూల్ కాంగ్రెస్, వైఎస్సార్‌సీపీ
- ఖర్చులో మొదటి స్థానంలో జగన్ మోహన్ రెడ్డి పార్టీ

**న్యూఢిల్లీ,**
అత్యధిక ఆదాయంతో దేశంలోనే ధనిక ప్రాంతీయ పార్టీగా ఏపీకి చెందిన తెలుగుదేశం పార్టీ నిలిచింది. ప్రధాన ప్రాంతీయ పార్టీల ఆదాయ వ్యయాలను అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) విశ్లేషించి తాజాగా నివేదిక విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం రూ. 228.31 కోట్ల ఆదాయంతో టీడీపీ దేశంలోనే ప్రథమ స్థానంలో ఉంది. మమతా బెనర్జీకి చెందిన తృణమూల్ కాంగ్రెస్ రూ. 219.35 కోట్లతో ద్వితీయ స్థానంలో, ఏపీలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ రూ. 219.35 కోట్ల ఆదాయంతో తృతీయ స్థానంలో ఉన్నాయి. ఇక ఖర్చుల పరంగా చూస్తే రూ. 340.20 కోట్లతో వైఎస్ఆర్ కాంగ్రెస్ మొదటి స్థానంలో ఉంది. ఈ పార్టీకి ఆదాయం కన్నా ఖర్చు రెట్టింపు కంటే ఎక్కువగా 142.33 శాతం ఉంది. తర్వాతి స్థానంలో 284.44 కోట్లతో

### తెలుగు జాతి గర్వించదగ్గ

## మహానేత ఎన్టీఆర్

**మహానేతను గౌరవించడం ఏ పార్టీకి పరిమితం కాదు**





- తెలుగు రాష్ట్రాల్లో ఎన్టీఆర్ సమర్థవంతమైన నేత
- ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు రాష్ట్ర ఆత్మగౌరవ ప్రతీక
- విగ్రహం ఏర్పాటులో విమర్శలకు తావులేదు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు
- అమీర్‌పేటలో ఎన్టీఆర్ విగ్రహం ఆవిష్కరణ

**హైదరాబాద్, మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హైదరాబాద్‌లోని అమీర్‌పేట మైత్రివనం జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన నందమూరి తారక రామారావు విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం ఘనంగా ఆవిష్కరించారు. కాంగ్రెస్ సీఎం ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం ఏమిటని చాలా మంది విమర్శిస్తున్నారని.. ఎవరు ఏమనుకున్నా, ఎలాంటి విమర్శలు చేసినా నేను భయపడను, వెనక్కి తగ్గను అని స్పష్టం చేశారు. తెలుగు జాతి గర్వించదగ్గ మహానేతను గౌరవించడం ఏ పార్టీకి పరిమితం కాదని, అది అందరి బాధ్యత అని ఆయన ఉద్ఘాటించారు. జాతీయ స్థాయిలో ఇందిరా

-మిగతా 2 లో





### హర్మ్యూజ్ జలసంధి

## ఎవరి సొత్తు కాదు

- చర్చలు విఫలమైతే వెనక్కి తగ్గబోం
- అవసరమైతే రక్షణ మంత్రిని రంగంలోకి
- ఇరాన్ అణ్వాయుధాలు సంపాదించకూడదు
- ప్రపంచ భద్రత కోసం ప్రయత్నిస్తున్నాం
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర వ్యాఖ్యలు

**మాస్కో**
ఇరాన్‌తో శాంతి చర్చలు కొనసాగిస్తున్నామని చెబుతూనే మరోవైపు అమెరికా సైనిక చర్యలకు దిగుతోంది. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ హర్మ్యూజ్ జలసంధి సమీపంలోని ఇరాన్ మిలిటరీ స్థావరాలను లక్ష్యంగా చేసుకుని అమెరికా వైమానిక దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో పలు ఇరాన్ డ్రోన్లను కూల్చివేసినట్లు అమెరికా రక్షణశాఖ వెల్లడించింది. హర్మ్యూజ్ ప్రాంతంలో తమ సైన్యానికి ముప్పు పెరుగుతోందని, అందుకే ముందస్తు చర్యగా ఈ దాడులు చేపట్టామని అధికారులు తెలిపారు. ఇక ఇరాన్‌తో జరుగుతున్న శాంతి చర్చలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. చర్చలు విఫలమైతే తాము వెనక్కి తగ్గబోమని,

-మిగతా 2 లో



## చంద్రుడిపై మానవుల నగరం..

- నాసా ప్రతిష్టాత్మక ప్రాజెక్టు
- 20 బిలియన్ డాలర్ల ఖర్చుతో 2032 నాటికి నిర్మాణం పూర్తి

**న్యూయార్క్**
అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా మరో చరిత్రాత్మక ప్రాజెక్టుకు శ్రీకారం చుడుతున్నది. చంద్రుడిపై మానవుల శాశ్వత నివాసం కోసం ఓ నగరాన్నే నిర్మించబోతున్నది. 20 బిలియన్ డాలర్ల ఖర్చుతో చేపడుతున్న ఈ ప్రాజెక్టు 2032 వరకు పూర్తవుతుందని నాసా ప్రకటించింది. దీంతో భూమి బయట మానవులు బతికే మొదటి నివాసం ఇదే కాబోతున్నది. ఈ ఏడాది చివరికల్లా దీన్ని ప్రారంభిస్తారు. మొదట్లో చిన్న క్యాంపులాగా ప్రారంభించి తర్వాత దాన్ని విస్తరించబోతున్నారు.

-మిగతా 2 లో

## దేశానికి ఆదర్శంగా ఫ్యూచర్ సిటీ



- నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రులు
- భవిష్యత్ అవసరాల దృష్ట్యా నగర నిర్మాణం
- మంత్రులు పొంగులేటి, శ్రీధర్ బాబుల వెల్లడి

**హైదరాబాద్, మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అభివృద్ధి చేస్తున్న ఫ్యూచర్ సిటీ దేశానికే ఆదర్శంగా నిలిచే విధంగా రూపుదిద్దుకుంటోందని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, శ్రీధర్ బాబు పేర్కొన్నారు. గురువారం ఫ్యూచర్ సిటీలో నిర్మాణంలో ఉన్న ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) కార్యాలయ భవనం, స్కిల్ యూనివర్సిటీ నిర్మాణ పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.

-మిగతా 2 లో

## తెలంగాణకు చల్లని కబురు

- రెండురోజుల్లో రుతుపవనాల ఆగమనం



2 లో

### 20 లక్షల ఇండ్లు కట్టిస్తేనే

## ఓట్లడగాలి


**మాట నిలబెట్టుకునే దమ్ముందా?**



- శపథాలు కాదు చేసి చూపించు
- డబ్బా ఇళ్లు కాదు..డబుల్ ఇళ్లు కట్టిన ఘనత మాది
- పొంగులేటి సవాల్‌పై కెటిఆర్ ప్రతిసవాల్

**హైదరాబాద్ మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హైదరాబాద్‌లో 20 లక్షల ఇండ్లు కట్టిస్తేనే ప్రజలను ఓట్లు అడగాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. గతంలో 20 లక్షల ఇందిరమ్మ ఇండ్లు కట్టాకే ఓట్లు అడుగుతామని సవాల్ చేసిన మంత్రి పొంగులేటికి ఆ మాట నిలబెట్టుకునే దమ్ముందా? అని ప్రశ్నించారు. సవాళ్లు చేయడం, ఆపై పారిపోవడం నీతిలేని కాంగ్రెస్ నేతలకు అలవాటేనని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శపథాలు చేయడం కాదనీ, చాతనైతే చేసి చూపించాలని కోరారు. దమ్ముంటే మ్యానిఫెస్టోలో

-మిగతా 2 లో



### ఉక్రెయిన్‌తో ఎడతెగని

## రష్యా యుద్ధం

- భారీగా సైనిక సంపదను కోల్పోయిన రష్యా
- 5లక్షల మంది సైన్యం మరణించినట్లు వార్తలు

**మాస్కో,మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రష్యా-ఉక్రెయిన్ మధ్య నాలుగేళ్లుగా కొనసాగుతోన్న యుద్ధం ఎప్పటికి ముగుస్తుందో తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలో కొన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. 2022 నుంచి జరుగుతోన్న ఈ ఘర్షణల్లో రష్యాకు సైనిక పరంగా భారీ నష్టం వాటిల్లినట్లు కనిపిస్తోంది. ఈ పోరులో 5 లక్షల మంది మాస్కో సైనికులు ప్రాణాలు కోల్పోయారని బ్రిటన్ నిఘా వర్గాలు అంచనావేశాయి. మరోవైపు, యుద్ధం ప్రారంభమైన దగ్గరినుంచి తాము 55వేలమంది సైనికులను కోల్పోయినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు

-మిగతా 2 లో

## ప్రతి పౌరుడికి సమగ్ర సంక్షేమ కార్డు..

- అన్ని శాఖల లబ్ధిదారుల డేటా సమీకరణ
- పారదర్శక సేవలకు ప్రత్యేక చర్యలు
- రాష్ట్ర సీఎం రేవంత్ కీలక ఆదేశాలు జారీ



**హైదరాబాద్, మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి అందుతున్న సంక్షేమ పథకాల వివరాలన్నీ ఒకే కార్డులో ఉండేలా సమగ్ర సంక్షేమ కార్డును (యూనిఫైడ్ కార్డ్ ) రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏ పౌరుడికి ఏ శాఖ ద్వారా, ఏ పథకం కింద, ఎంత మేర లబ్ధి చేకూరుతోందో ఈ కార్డ్ ద్వారా స్పష్టంగా తెలిసేలా ఉండాలని సూచించారు. తక్షణమే అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, అన్ని శాఖల నుంచి లబ్ధిదారుల డేటాను సేకరించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. మంత్రి శ్రీధర్ బాబు,

-మిగతా 2 లో

## ఎట్టకేలకు సిద్దరామయ్య రాజీనామా

(మొదటి తరువాయి)

డీకే శివకుమార్‌తో కలిసి ఆయన లోక్‌భవన్‌కు వెళ్లారు. అయితే, ఆ సమయంలో గవర్నర్ థావర్ చంద్ గహ్లోత్ అందుబాటులో లేకపోవడంతో ఆయన కార్యదర్శికి సిద్దరామయ్య తన రాజీనామా లేఖను సమర్పించారు. ఈ విషయాన్ని గవర్నర్ ప్రత్యేక కార్యదర్శి సైతం ధ్రువీకరించారు. సీఎం రాజీనామా లేఖను తీసుకున్నామని, గవర్నర్ తిరిగొచ్చాక దీనిపై నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. గహ్లోత్ ఈ సాయంత్రం బెంగళూరు చేరుకోనున్నారు. అనంతరం మంత్రులు డీకే శివకుమార్, పరమేశ్వరతో కలిసి సిద్దరామయ్య మీడియాతో మాట్లాడారు. అధిష్ఠానం సూచనలతో సీఎం పదవికి రాజీనామా చేశా. హైకమాండ్ ఆదేశాలకు అందరం కట్టుబడి ఉంటాం. రాష్ట్ర ప్రయోజనాల కోసమే వైదొలిగా. నిబంధనల ప్రకారం ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశా. దాన్ని గవర్నర్ ఆమోదిస్తారని విశ్వాసం ఉంది. అసెంబ్లీలో కాంగ్రెస్‌కు సంపూర్ణ మెజార్టీ ఉంది. రాజ్యాంగబద్ధంగా కొత్త ప్రభుత్వం ఏర్పడుతుంది. ఇప్పటివరకు ప్రభుత్వ నిర్వహణలో నాకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు. సీఎంగా నాకు అవకాశమిచ్చిన సోనియా, రాహుల్, ఖర్గేకు కృతజ్ఞతలు. 7 కోట్ల మంది కర్ణాటక ప్రజలకు సేవ చేసే అవకాశం లభించింది. రాజ్యాంగమే మా ధర్మం. ప్రజలే మాకు దేవుళ్లు అని సిద్దరామయ్య తెలిపారు. జాతీయ రాజకీయాల్లోకి రావాలని హైకమాండ్ అడిగింది. రాజ్యసభ సీటు ఆఫర్ చేసింది. కానీ, నేను సున్నితంగా తిరస్కరించా. జాతీయ స్థాయి రాజకీయాలపై నాకు ఆసక్తి లేదు. అయితే, రాజకీయాల నుంచి వైదొలిగే ప్రసక్తే లేదు. ప్రజలు నన్ను 5 ఏళ్ల కాలానికి ఎన్నుకున్నారు. ఇంకా రెండేళ్లు మిగిలి ఉన్నాయి. అప్పటివరకు ఎమ్మెల్యేగానే కొనసాగుతానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తన రాజకీయ ప్రస్థానాన్ని గుర్తుచేసుకుంటూ సిద్దరామయ్య ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. నేను పొరపాటున రాజకీయాల్లోకి వచ్చా. మా కుటుంబంలో అంతకుముందు ఎవరూ రాజకీయాల్లో లేరు. 2006లో కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి హైకమాండ్ నన్ను ఆదరించింది. సీఎం అవుతానని కలలో కూడా అనుకోలేదు. అలాంటిది ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా రెండేసిసార్లు సేవలందించా. మ్యానిఫెస్టోలో ఇచ్చిన 160 హామీల్లో 158 నెరవేర్చా. మొదటి ఏడాదిలోనే ఐదు గ్యారెంటీలు అమలు చేశా. నాపై ప్రతిపక్షాలు వదంతులు ప్రచారం చేశాయి. కానీ, నా రాజకీయ జీవితం తెరిచిన పుస్తకం. పదవి కోసం, డబ్బు కోసం ఏనాడూ పాకులాడలేదని సిద్దరామయ్య వివరించారు. ఈ క్రమంలో అధిష్ఠానంతో భేటీకి సిద్దరామయ్య దిల్లీ వెళ్లనున్నట్లు సమాచారం. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో భేటీ కానున్నారు. కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యేల సమావేశానికి సంబంధించి నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. సిద్దరామయ్య స్థానంలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ బాధ్యతలు చేపట్టడం దాదాపు ఖాయంగానే కనిపిస్తోంది. శనివారం జరిగే సీఎల్పీ సమావేశంలో కొత్త శాసనసభాపక్ష నేతను ఎన్నుకునే అవకాశం ఉంది. ప్రమాణస్వీకార కార్యక్రమంపై అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు.

## రాబోయే ఐదేండ్లూ భగభగలే..

(మొదటి తరువాయి)

ఒకవేళ సగటు ఉష్ణోగ్రతలు 1.5 డిగ్రీలు దాటితే తీవ్రమైన వాతావరణ మార్పులు, అకాల వర్షాలు, వరదలు, కరువు, సముద్ర మట్టాలు పెరగడానికి దారితీస్తుంది. డబ్ల్యూఎంవో తాజా నివేదిక ప్రకారం, రాబోయే ఐదేండ్లలో ప్రపంచ సగటు ఉష్ణోగ్రతలు రికార్డ్‌స్థాయిలో లేదా దానికి సమీపంలో ఉండే అవకాశముంది. 2026 నుండి 2030 వరకు అంచనా వేసిన భూ ఉపరితల ఉష్ణోగ్రతలు 1850–1900 (పారిశ్రామిక విప్లవానికి ముందు) సగటు కంటే 1.3 నుండి 1.9 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. 2024 అత్యంత వేడి సంవత్సరంగా రికార్డ్ నెలకొల్పింది. సగటు ఉష్ణోగ్రతల్లో పెరుగుదల 1.55 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకుంది. తాజా అంచనాల ప్రకారం రాబోయే ఐదేండ్లలో 1.5 డిగ్రీల సెల్సియస్ పరిమితిని దాటే అవకాశం చాలా ఎక్కువగా ఉంది. 2026–30 మధ్య ఏదో ఒక సంవత్సరం అత్యంత వేడి సంవత్సరంగా 2024ను అధిగమించే అవకాశం 86 శాతం ఉంది.

## దేశంలోనే ధనిక ప్రాంతీయ పార్టీగా టీడీపీ..

(మొదటి తరువాయి)

బిజూ జనతాదళ్ (బీజేడీ), 227.59 కోట్లతో టీఎంసీ మూడో స్థానంలో నిలిచాయి.దేశంలోని మొత్తం 36 ప్రాంతీయ పార్టీల ఆదాయం అంతకు మందు ఏడాదితో పోలిస్తే 2024–25లో 51 శాతం వరకు తగ్గిపోయింది. అలాగే 21 పార్టీల ఖర్చు తమ ఆదాయం కన్నా ఎక్కువగా చూపినట్టు ఈ నివేదిక తెలిపింది. దేశంలో గుర్తింపు పొందిన ప్రాంతీయ పార్టీలు 67 ఉండగా, అందులో 2024–25 ఆర్థిక సంవత్సరానికి 36 పార్టీలు మాత్రమే ఆడిట్ రిపోర్టులు పంపాయని, వాటి ఆధారంగానే ఈ నివేదిక తయారు చేసినట్టు సంస్థ వెల్లడించింది. టీఎంసీకి రూ.184.08 కోట్లు, వైఎస్ఆర్ పార్టీకి 140.05 కోట్లు, టీడీపీకి 85.20 కోట్లు విరాళంగా వచ్చాయి. ఈ నివేదిక తయారు చేసేటప్పటికి డీఎంకే, శివసేన, శివసేన (యూబీటీ), ఎన్సీపీ, జమ్ముకశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీలు 2024–25 ఆర్థిక సంవత్సరానికి తమ ఆడిట్ నివేదికలు సమర్పించ లేదు. 2024–25లో ప్రాంతీయ పార్టీలన్నింటిలో అగ్రశ్రేణి ఐదు ప్రాంతీయ పార్టీలు మొత్తం ఆదాయంలో దాదాపు 69 శాతాన్ని కలిగి ఉన్నాయి.

## హర్మూజ్ జలసంధి ఎవరి సొత్తు కాదు

(మొదటి తరువాయి)

అవసరమైతే రక్షణ మంత్రిని రంగంలోకి దించి పని పూర్తిచేస్తామంటూ హెచ్చరించారు. అమెరికాలో మధ్యంతర ఎన్నికలు ఉన్నాయని ఇరాన్ భావిస్తోందని, కానీ తాను ఎన్నికలను పట్టించుకోనని ట్రంప్ వ్యాఖ్యానించారు. “ఇరాన్ అణ్వాయుధాలు సంపాదించకూడదు. అది కేవలం అమెరికా కోసమే కాదు. ప్రపంచ భద్రత కోసం చేస్తున్న పని అని ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ నాయకత్వం అమెరికాతో ఒప్పందం చేసుకోవాలని కోరుకుంటోందని, కానీ ఇప్పటివరకు సరైన పురోగతి కనిపించలేదన్నారు. “ఇప్పటివరకు మేము సంతృప్తిగా లేం. కానీ చివరికి అవుతాం” అని ఆయన వ్యాఖ్యానించారు. హర్మూజ్ జలసంధిపై కూడా ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రాంతం అంతర్జాతీయ జలమార్గమని, దీనిని ఏ దేశం నియంత్రించలేదని అన్నారు. “హర్మూజ్ అందరికీ తెరిచి ఉంటుంది. మేము పర్యవేక్షిస్తాం కానీ దానిపై ఎవరికీ పూర్తి నియంత్రణ ఉండదు” అని తెలిపారు. ఇదే అంశం ప్రస్తుతం జరుగుతున్న చర్చల్లో భాగమని వెల్లడించారు. అంతేకాదు ఒమన్‌కు కూడా ట్రంప్ హెచ్చరికలు జారీ చేశారు. హర్మూజ్ చర్చల్లో ఒమన్ జోక్యం చేసుకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని అన్నారు. “ప్రపంచంలోని మిగతా దేశాల్లాగే ఒమన్ కూడా ప్రవర్తించాలి. లేకపోతే మేం చర్యలు తీసుకోవాల్సి వస్తుంది” అని ఘాటుగా స్పందించారు. ఇదిలా ఉంటే, ఇరాన్ ప్రభుత్వ మీడియా ఓ సంచలన కథనాన్ని ప్రసారం చేసింది. అమెరికా, ఇరాన్ మధ్య తాత్కాలిక అవగాహన ఒప్పందం కుదిరిందని, యుద్ధ పరిస్థితులను తగ్గించే దిశగా రెండు దేశాలు ముందడుగు వేసాయని పేర్కొంది. ఈ ఒప్పందం ప్రకారం అమెరికా తన నౌకాదళ దిగ్బంధాన్ని ఎత్తివేయాలని, గల్ఫ్ ప్రాంతం నుంచి సైనిక బలగాలను వెనక్కి తీసుకోవాలని కథనంలో పేర్కొన్నారు. అలాగే హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకల రాకపోకలు 30 రోజుల్లో సాధారణ స్థితికి చేరుకుంటాయని ఇరాన్ మీడియా వెల్లడించింది. ఈ ప్రాంతంలో వాణిజ్య నౌకల పర్యవేక్షణను ఇరాన్, ఒమన్ సమన్వయంతో నిర్వహిస్తాయని కూడా పేర్కొంది. అయితే ఈ వార్తలను అమెరికా వైట్ హౌస్ పూర్తిగా ఖండించింది. “ఇరాన్ ప్రభుత్వ నియంత్రణలో ఉన్న మీడియా ప్రచారం చేస్తున్న కథనాలు పూర్తిగా అబద్ధాలు. వారు విడుదల చేశామంటున్న అవగాహన ఒప్పందం పూర్తిగా కల్పితం అని వైట్ హౌస్ ఎక్స్ వేదికగా ప్రకటించింది. ఇరాన్ మీడియా కథనాలను ఎవరూ నమ్మవద్దని స్పష్టం చేసింది. మరోవైపు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కూడా ఈ అంశంపై స్పందించారు. అమెరికా ఇప్పటికీ దౌత్య మార్గానికే ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. “దౌత్య చర్చలే ఎప్పుడూ మొదటి ఎంపిక. ఒప్పందం కుదిరే అవకాశం ఉంటే మేము సిద్ధంగా ఉన్నాం” అని అన్నారు. ఇటీవల కొన్ని చర్చల్లో పురోగతి కనిపించిందని, రాబోయే గంటలు, రోజుల్లో పరిస్థితి మరింత స్పష్టమవుతుందని తెలిపారు.

# తెలుగు జాతి గర్వించదగ్గ మహానేత ఎన్టీఆర్

(మొదటి తరువాయి)

గాంధీ పి.వి. నరసింహారావు వంటి నాయకులను అందిస్తే, తెలుగు రాష్ట్రాల్లో ఎన్టీఆర్ కూడా అదే స్థాయిలో సమర్థవంతమైన నాయకత్వాన్ని తయారు చేశారని కొనియాడారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ప్రసంగంలో మాజీ సీఎం కేసీఆర్‌పై నేరుగా విమర్శనాస్త్రాలు సంధించారు. నాడు ఎన్టీఆర్ లేకుంటే కేసీఆర్ గానీ, లేదా ఇతర నేతలు గానీ ఈ స్థాయికి వచ్చేవాళ్లా? అని ప్రశ్నించారు. కేసీఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టింది ఎన్టీ రామారావు అని, ఆయన నీడన బతికి ఈరోజు ఆయన గురించే తక్కువ చేసి మాట్లాడటం సరికాదని హితవు పలికారు. ఎన్టీఆర్ పేరు చెప్పుకుని రాజకీయం చేస్తూ, ఆయన విగ్రహాల ఏర్పాటును వ్యతిరేకించడం లేదా తక్కువ చేయడం వారి నకిలీ ఆలోచనలకు నిదర్శనమని రేవంత్ ఎద్దేవా చేశారు.సంక్షేమ పథకాల విషయంలో ఎన్టీఆర్ దార్శనికతను రేవంత్ రెడ్డి ఆకాశానికెత్తారు. ఆనాడు ఎన్టీఆర్ ప్రారంభించిన పక్కా ఇళ్ల పథకమే నేటి ఇందిరమ్మ ఇళ్ల పథకానికి పునాది అని ఆయన గర్వంగా ప్రకటించారు. పేదలకు గూడు కల్పించాలనే ఎన్టీఆర్ సంకల్పాన్ని తమ ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని చెప్పారు. తుమ్మల నాగేశ్వరరావు, మండవ వెంకటేశ్వరరావు వంటి నేతలను రాజకీయాలకు పరిచయం చేసిన ఘనత ఎన్టీఆర్‌దేనని, ఆ వారసత్వాన్ని తాము గౌరవిస్తామని తెలిపారు.కాంగ్రెస్ వేదికలపై ఎన్టీఆర్ నామాన్ని జపించడంపై వస్తున్న రాజకీయ



విమర్శలను రేవంత్ రెడ్డి కొట్టిపారేశారు. రాజకీయాలకు అతీతంగా ఎన్టీఆర్ ఒక వ్యవస్థ అని, ఆయన విగ్రహం అమీర్‌పేట వంటి ప్రాంతంలో ఉండటం తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. హైదరాబాద్ అభివృద్ధిలో ఎన్టీఆర్ వేసిన పునాదులను ఎవరూ విస్మరించలేరని, అలాంటి మహానుభావుడికి నివాళి అర్పించడం తన అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. మైత్రివనం వద్ద జరిగిన ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమం కేవలం ఒక విగ్రహావిష్కరణలా కాకుండా, రేవంత్ రెడ్డి రాజకీయ చాణక్యానికి వేదికగా మారింది. ఒకవైపు ఎన్టీఆర్ అభిమానులను ఆకట్టుకుంటూనే, మరోవైపు కేసీఆర్ , బీఆర్ఎస్ వైఖరిని ఎండగట్టడంలో రేవంత్ సక్సెస్ అయ్యారు. ఈ పరిణామం తెలుగుదేశం సానుభూతిపరులను కూడా కాంగ్రెస్ వైపు ఆలోచింపజేసేలా ఉందని భావిస్తున్నారు. వ్యవసాయాన్ని పండుగ చేయటమే లక్ష్యంగా పరిపాలన చేస్తున్నాం. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు ఇవ్వాలనే రాజీవ్‌గాంధీ నిర్ణయాన్ని ఎన్టీఆర్ అమలు చేశారు. వచ్చే ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇస్తాం. ఇందిరమ్మ ఇళ్లలో ఉన్న నిరుపేదలకు టికెట్లు ఇచ్చి ఎమ్మెల్యేలను చేశాం. ఎన్టీఆర్ స్ఫూర్తితోనే ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్నామని అన్నారు. టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్? మాట్లాడుతూ, ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేస్తామని మాట ఇచ్చామని, నిలబెట్టుకున్నామని తెలిపారు. మాట ఇస్తే కాంగ్రెస్ నిలబెట్టుకుందనడానికి ఇదే నిదర్శనని వెల్లడించారు. ఎన్టీఆర్‌ను ఒక ప్రాంతానికో, వర్గానికో పరిమితం చేయడం సరికాదని సూచించారు. పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. ఇందిరాగాంధీ, ఎన్టీఆర్ పాలన మాదిరే రేవంత్‌రెడ్డి పరిపాలిస్తున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలో పేదలకు సంక్షేమ కార్యక్రమాలు అందుతున్నాయని తెలిపారు.జాతి గర్వించదగిన వ్యక్తి ఎన్టీఆర్ అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కొనియాడారు. ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనేది జూబ్లీహిల్స్ ప్రజల కోరిక అని అన్నారు. తెలుగువాడి గుండెల్లో చిరస్థాయిగా నిలబడిన వ్యక్తి ఎన్టీఆర్ అని, రేవంత్ రెడ్డి ప్రజారంజక పాలన కొనసాగిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి పలువురు ఎన్టీఆర్ కుటుంబసభ్యులు కూడా హాజరయ్యారు.

## తెలంగాణకు చల్లని కబురు

### రెండురోజుల్లో రుతుపవనాల ఆగమనం



**హైదరాబాద్,**

:తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడిపోతున్న తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ ఓ చల్లని కబురు అందించింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతూ రెండు రోజుల్లో రాష్ట్రంలోకి ప్రవేశించనున్నాయని వెల్లడించింది. ఈ రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం ఒక్కసారిగా చల్లబడటమే కాకుండా, రాగల మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రుతుపవనాలు రాష్ట్రవ్యాప్తంగా పూర్తిగా విస్తరించడానికి ముందు రాబోయే రెండు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో వడగాలుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని, పగటిపూట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మరింత ఎక్కువయ్యే ప్రమాదం ఉందని పేర్కొంది. అందువల్ల రుతుపవనాలు పూర్తిగా ప్రవేశించే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎండ తీవ్రత దృష్ట్యా మధ్యాహ్నం వేళల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

## 20 లక్షల ఇండ్లు కట్టిస్తేనే ఓట్లడగాలి

(మొదటి తరువాయి)

ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేస్తామని ప్రతినబూనాలని సవాల్ విసిరారు. తాము కట్టిన ఒక్కో డబుల్ బెడ్రూంకు ఏడు ఇందిరమ్మ ఇండ్లతో సమానమని పేర్కొన్నారు. వారికి చిత్తశుద్ధి, సత్తా ఉంటే తాము కట్టిన వాటికి మించి హైదరాబాద్‌లో డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టాలని డిమాండ్ చేశారు. తాము ఇండ్లు కడితే, కాంగ్రెస్ ప్రభుత్వం కూలగొడుతున్నదని విమర్శిం చారు. గత రెండున్నర ఏండ్లలో హైదరాబాద్ నగరంలో కట్టిన ఇండ్లు ఎన్ని? పడగొట్టిన ఇండ్లు ఎన్ని? అనే దానిపై శ్వేతపత్రం ప్రకటించే ధైర్యం ఉందా?అని ప్రశ్నించారు. దీపావళికి బాంబులు పేలుస్తామని చెప్పి తుస్సు మనిపించిన ‘తుపేల్ మినిస్టర్’, ‘మిస్టర్ బాంబులేటి’ అని ఎద్దేవా చేశారు. పొంగులేటి మాదిరి కోహినూరు హోటల్లో కాళ్లు పట్టుకుని, ఢిల్లీకి లొంగిపోయి కేసుల నుంచి తప్పించుకునే ఉపాయం తమకు తెలియదని పేర్కొన్నారు. రెవెన్యూ శాఖను అడ్డుపెట్టుకుని భూభారతిలో బ్లాక్ లిస్టులు, బ్లాక్ మెయిల్ దందాలు చేసి దండుకునే ల్యాండ్ గేమ్స్, గూండాలను ఉసిగొల్పి సామాన్యులపై దౌర్జన్యాలు చేసి భూములను బుక్క పట్టడం తమకు తెలియని తెలిపారు. అడ్డదారుల్లో కొడుకు కంపెనీకి రూ.వేల కోట్ల కాంట్రాక్టులు ఇప్పించుకునే అవినీతి కిటుకులు, అక్రమ క్రషర్లు నడుపుతూ అడ్డగోలుగా ప్రభుత్వ సొమ్మును కొల్లగొట్టే చిట్కాలు తమకు తెలియవని పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాల నేతల మీద అహంకారంతో పేపర్లు విసిరికొట్టడం కూడా తమకు తెలియదని వివరించారు. బీఆర్ఎస్ హయాంలో ఆత్మగౌరవ గృహాలు కట్టామని గుర్తు చేశారు. హైదరాబాద్ మహా నగరంలో ఏకంగా లక్ష డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించిన ఘనత తమదేనని తెలిపారు. ప్రభుత్వం ఎన్ని పనికిమాలిన ప్రగల్భాలు పలికినా, ఎన్ని డైవర్షన్ డ్రామాలు ఆడినా 420 హామీల ఎన్నికల మోసాన్ని ఎండగట్టకుండా వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్ల ఎగవేత ద్రోహాన్ని ప్రశ్నించకుండా విడిచిపెట్టబోమని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## ఉక్రెయిన్‌తో ఎడతెగని రష్యా యుద్ధం

(మొదటి తరువాయి)

జెలెన్‌స్కీ ఈ ఫిబ్రవరిలో వెల్లడించారు. ఇరువైపులా ప్రాణనష్టం భారీగానే ఉన్నా.. రెండు దేశాలు వాస్తవ లెక్కలను వెల్లడించట్లేదనే ఆరోపణలున్నాయి. గత నాలుగేళ్లుగా డాన్‌బాస్ ప్రాంతంలోని ఉక్రెయిన్ స్థావరాలపై దాడుల కోసం రష్యా తన సైనికులను దశలవారీగా మోహరించింది. కొత్తగా చేరిన సైనికులు, జైళ్ల నుంచి నియమించుకున్నవారు ఈ ఘర్షణల్లో పాల్గొన్నారు. వారికి సరైన శిక్షణ లేకపోవడం.. యుద్ధరంగంలో భారీగా ప్రాణనష్టానికి దారితీస్తున్నట్లు కనిపిస్తోంది. మరోవైపు, అమెరికా, దాని మిత్రదేశాలు సరఫరా చేసే క్షిపణి వ్యవస్థలు, ఫిరంగి, అధునాతన డ్రోన్లను ఉక్రెయిన్ ఉపయోగిస్తోంది. కమాండ్ పోస్టులు, సైనిక సమూహాలు లక్ష్యంగా జెలెన్‌స్కీ సైన్యం దాడులు చేస్తోంది. దాంతో ఈ నష్టం మరింత పెరిగిందనే అంచనాలున్నాయి. ఈ దాడులను ఎదుర్కొనేలా రష్యా సుశిక్షితులైన సైనికులను నియమించుకోలేక పోతుందని, విధుల్లో ఉన్నవారిని కాపాడుకునేలా ఎలాంటి రక్షణకవచాలను సమీకరించలేకపోతుందని యూకే నిఘా వర్గాలు అంచనా వేశాయి. ఈ కారణాలే రష్యాను దెబ్బతీస్తున్నట్లు విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే.. ఆర్మీలో యువతను చేర్చుకునేందుకు రష్యా ప్రభుత్వం వారికి పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు ప్రకటిస్తోంది. ఇందులో భాగంగా రక్షణశాఖతో ఒప్పందం కుదుర్చుకునే వారికి, వారి కుటుంబాలకు ఉండే రుణాల్లో 10 మిలియన్ రూబుల్స్ (సుమారు రూ.1.33కోట్లు) వరకు మాఫీ చేస్తామని హామీ ఇచ్చింది. కొత్తగా సైన్యంలో చేరాలనుకునే వారు కనీసం ఏడాది పాటు కొనసాగుతానని హామీ ఇవ్వాల్సి ఉంటుందని, ఇందుకు సంబంధించిన నిర్ణయంపై అధ్యక్షుడు పుతిన్ సంతకం చేసినట్లు వార్తలు వచ్చాయి.

## చంద్రుడిపై మానవుల నగరం..

(మొదటి తరువాయి)

ఎలా ఉంటుంది..?

ఈ నగరాన్ని భూమి మీద నుంచి తీసుకెళ్లే మడతపెట్టగల వసువులతో తయారు చేస్తారు. చంద్రుడి దక్షిణ ధృవంకు దగ్గర్లోనే ఈ నగరాన్ని నిర్మించబోతున్నారు. ఎందుకంటే అక్కడ నీటి నిక్షేపాలు ఉన్నాయి. ఈ నగరం భూమిమీద ఉన్న ఇండ్ల మాదిరిగా ఉండబోతున్నది. అలాగే కఠినమైన పరిస్థితులను తట్టుకునేలా దీన్ని డిజైన్ చేస్తారు. నాసా అడ్మినిస్ట్రేటర్ జేరెడ్ ఇసాక్‌మాన్ మాట్లాడుతూ.. ఈ ఏడాది చివర్లో చంద్రుడిపైకి సైంటిఫిక్ వస్తువులను పంపుతామన్నారు. వాటి ద్వారా ఎక్కడ నగరం నిర్మాణానికి అనువుగా ఉంటుందో సెర్చ్ చేసి.. వచ్చే సంవత్సరం నుంచి నిర్మాణ పనులు మొదలు పెడుతామన్నారు. దీంతో నాసా చేపట్టే ఈ నగరం గురించి పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నది.

## దేశానికి ఆదర్శంగా ఫ్యూచర్ సిటీ

(మొదటి తరువాయి)

. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఫ్యూచర్ సిటీని అత్యాధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తోందన్నారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనకు కేంద్రంగా స్కిల్ యూనివర్సిటీ నిలవబోతోందని చెప్పారు. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయం ద్వారా నగర అభివృద్ధి పనులకు మరింత వేగం చేకూరుతుందని పేర్కొన్నారు. నిర్మాణ పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందని మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. స్కిల్ యూనివర్సిటీ శాశ్వత క్యాంపస్ పనులను తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని సమీక్షించారు. నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని అధికారులకు మంత్రులు ఆదేశాలు జారీ చేశారు. ఎఫ్‌సీడీఏ కార్యాలయం, స్కిల్ యూనివర్సిటీ పనులపై మార్గనిర్దేశర చేశారు. నిర్దేశిత గడువులో పనులు పూర్తి చేయాలని సూచించారు. ఆధునిక మౌలిక వసతులతో ఫ్యూచర్ సిటీ రూపుదిద్దుకుంటోందని తెలిపారు. ఫ్యూచర్ సిటీ దేశానికి తలమానికంగా నిలవడం ఖాయమని మంత్రులు స్పష్టం చేశారు.

## ప్రతి పౌరుడికి సమగ్ర సంక్షేమ కార్డు..

(మొదటి తరువాయి)

సీఎస్ రామకృష్ణారావు, సీఎం స్పెషల్ సెక్రటరీ బి.అజిత్ రెడ్డి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి తదితర ఉన్నతాధికారుల సమీక్షలో సీఎం ఈ విషయాన్ని ప్రత్యేకంగా చర్చించారు. సమగ్ర సంక్షేమ కార్డ్ ద్వారా రాష్ట్రంలోని ప్రతి పౌరుడి పూర్తి సంక్షేమ ప్రొఫైల్ ఒకేచోట అందుబాటులోకి వస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. ఈ డేటాను అన్ని కోణాల్లో ఏఐ సహాయంతో విశ్లేషిస్తే సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పెరుగుతుందన్నారు. నిజమైన అర్హులకు పథకాలు మరింత ఖచ్చితంగా చేరుతాయన్నారు. అదే సమయంలో అనర్హులను గుర్తించడం సులభమవుతుందని అభిప్రాయపడ్డారు. ప్రతి శాఖ వేర్వేరుగా కార్డులు ఇచ్చే పద్ధతికి బదులు, ఐటీ శాఖ ఆధ్వర్యంలో సమగ్ర సంక్షేమ కార్డ్ ఉండాలని సీఎం సూచించారు. టెక్నాలజీపై పట్టున్న, చురుగ్గా పనిచేసే యువ ప్రభుత్వ అధికారులను ఈ ప్రక్రియకు వినియోగించాలని చెప్పారు.ఈ కార్డ్‌లో ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి, ఫీజు రీయింబర్స్‌మెంట్, కార్మిక శాఖ, విద్యా శాఖ, ఇన్సూరెన్స్ పథకాలు, ప్రభుత్వం తీసుకువస్తున్న బీమా పథకాల వివరాలు ఉండాలని చెప్పారు. అవసరమైతే ఆధార్ నంబర్ తరహాలో రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక యూనిక్ ఐడెంటిటీ నంబర్ ఇచ్చేలా ఆలోచించాలన్నారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే వివరాలను కూడా ఈ కార్డ్‌కు అనుసంధానించాలన్నారు.

లబ్ధిదారుల వివరాలతో పాటు వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఖ్య, ఇతర వివరాలను సేకరించాలని ఐటీ శాఖను ఆదేశించారు. ఏఐ ఆధారిత ప్రొఫైలింగ్ ఉండాలని సీఎం సూచించారు ఎక్కడైనా మరణ ధృవీకరణ పత్రం జారీ అయితే, ఆ సమాచారం చేయూత పెన్షన్ డేటాబేస్‌కు చేరాలని, వెంటనే దాని ఆధారంగా చర్యలు మొదలయ్యేలా ఉండాలన్నారు. ప్రజల ఆరోగ్య ప్రొఫైల్‌ను కూడా సమగ్ర సంక్షేమ కార్డ్ తో లింక్ చేయాలని చెప్పారు. కేరళ నుంచి గల్ఫ్‌కు వలస వెళ్లే ఉద్యోగులకు అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు. నైపుణ్యాభివృద్ధి, శిక్షణ కార్యక్రమాలతో పాటు, పాస్‌పోర్టులు, వీసాల జారీకి సంబంధించిన సమాచారం ఒకేచోట అందుబాటులో ఉంచితే, అనధికార ఏజెంట్ల ప్రమేయం తగ్గుతుందని తెలిపారు. పేదలకు సంక్షేమ ఫలాలు ఖచ్చితంగా చేరేలా, ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకం ప్రభావాన్ని అంచనా వేసేలా సమగ్ర సంక్షేమ కార్డ్ ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## మేకల మేత కోసం వెళ్లిన మహిళ చెట్టు పై నుంచి పడి మృతి



**కరీంనగర్, మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తిమ్మారెడ్డిపల్లిలో గురువారం ఉదయం దుర్ఘటన చోటుచేసుకుంది. మేకల మేత కోసం వెళ్లిన బొగ్గుల లక్ష్మి (40) చెట్టు కొమ్మలు కొడుతుండగా అకస్మాత్తుగా చెట్టు పై నుంచి పడిపోయి అక్కడికక్కడే మృతి చెందింది. అదే చెట్టు పైన విద్యుత్ వైర్లు ఉండటంతో కరెంట్ షాక్ వల్ల మరణించిందా లేదా చెట్టు పై నుంచి జారిపడి మరణించిందా అన్న అనుమానం వ్యక్తమవుతోంది. కొద్ది రోజుల క్రితం లక్ష్మి భర్త బొగ్గుల శివులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, ఇప్పుడు లక్ష్మి మరణంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామస్తుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఒకే కుటుంబంలో వరుసగా జరిగిన ఈ ఘటనతో తిమ్మారెడ్డిపల్లి గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది.


## రజక సంఘం పేరుతో అనధికారిక బోర్డులను వెంటనే తొలగించాలి

**- బొడ్డుపల్లి రమేష్**




**పెద్దపల్లి, మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా కేంద్రంలో రజకుల భూమిపై ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పేరుతో బోర్డు ఏర్పాటు చేయడాన్ని రజక సంఘం తీవ్రంగా వ్యతిరేకించింది. జిల్లా అధ్యక్షుడు బొడ్డుపల్లి రమేష్ మాట్లాడుతూ తెలంగాణ పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ పేరును పెట్టాల్సింది పోయి రాజకీయ నాయకుల పేర్లతో బోర్డులు పెట్టడం రజకుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్య అని మండిపడ్డారు. స్వలాభాల కోసం రజక జాతిని వాడుకోవడం సిగ్గుచేటని, ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి ఇప్పుడు బోర్డులు వేయడం రాజకీయ డ్రామా తప్ప మరేమీ కాదని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహరరెడ్డి రజక సంఘం బోనాల జాతరలకు వెండి కిరీటాలు, ఆభరణాలు సమర్పించడం, పేద రజకులకు సహాయం చేయడం ద్వారా సంఘం పట్ల గౌరవాన్ని చాటుకున్నారని గుర్తు చేశారు. ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేసినట్లు, నిలువెత్తు విగ్రహం ప్రతిష్టించేందుకు కూడా ఆయన సుముఖంగా ఉన్నారని వివరించారు. రజక సంఘం పేరుతో అనధికారిక బోర్డులను వెంటనే తొలగించి, వీర వనిత చిట్యాల ఐలమ్మ పేరుతో నామకరణం చేయాలని రమేష్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. రజకుల ఆత్మగౌరవాన్ని కాపాడే దిశగా సంఘం కఠిన నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేసింది.

## అక్రమ ఇసుక డంపు పట్టివేత



**కరీంనగర్ రూరల్, మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మోగ్దూంపూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీ సమీపంలో అక్రమంగా ఇసుక నిల్వ చేసినట్లు సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అక్కడ ఇసుక డంపు కనిపించగా, సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు కిసాన్ నగర్‌కు చెందిన నీరుకుళ్ల అనిల్, మొగ్దూంపూర్‌కు చెందిన వడ్లూరి మల్లేష్‌గా గుర్తించారు. మానేరు వాగు నుండి రాత్రి సమయంలో అక్రమంగా ఇసుకను తవ్వి నిల్వ ఉంచి, కరీంనగర్ పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు నిందితులు ఒప్పుకున్నారు. పోలీసులు ఇసుకను సీజ్ చేసి పంచనామా నిర్వహించారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు రూరల్ ఇన్స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి తెలిపారు. అక్రమ ఇసుక రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు.

## కాలువ మరమ్మత్తు పనులు ప్రారంభం



**గన్నేరువరం, మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మాదాపూర్ గ్రామంలోని డి9 ఎల్1 కాలువలో పూడిక మట్టి, చెత్త తొలగింపు పనులను సర్పంచ్ మాధరి శ్రీనివాస్ ప్రారంభించారు. రైతులకు సాగు నీటి సౌకర్యం మెరుగుపడేలా పనులు చేపడుతున్నామని ఆయన తెలిపారు. కూలీలు కొలతల ప్రకారం పనిచేసి అధిక వేతనం పొందాలని సూచించారు. పనులు జరుగుతున్న ప్రదేశంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సీనియర్ మీటుకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కల్లెం అనిత, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి కోసం ఉపాధి హామీ పనులు వేగంగా సాగుతున్నాయి.

## వీర్ సావర్కర్‌కు ఘన నివాళులు




**కల్వకుర్తి, మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కల్వకుర్తి పట్టణంలో స్వామి వివేకానంద సేవా బృందం, మై భారత్ ఆధ్వర్యంలో వీర్ సావర్కర్ జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు. స్థానిక ఎమ్మార్వో కార్యాలయం ముందు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి స్మరించగా, అనంతరం ప్రభుత్వ PBS వృద్ధ అనాధ ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు, పాల ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, “వీర్ సావర్కర్ బాల్యంలోనే దేశభక్తిని ప్రదర్శించారు. 12 ఏళ్ల వయసులోనే ‘అభినవ్ భారత్’ అనే రహస్య విప్లవ సంస్థను స్థాపించారు. ఆయన రచించిన ‘1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం’ గ్రంథాన్ని బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించింది. 1910లో లండన్‌లో అరెస్టయి భారత్‌కు తరలింపులో మార్సెలీస్ ఓడరేవులో సముద్రంలోకి దూకి పారిపోవడానికి ప్రయత్నించారు. అనంతరం జీవిత ఖైదు విధించి అండమాన్ సెల్యులార్ జైలుకు పంపారు. 11 ఏళ్లు నరకయాతన అనుభవించి, గోడలపై గోళ్లతో, బొగ్గుతో కవితలు రాసిన గొప్ప నాయకుడిగా చరిత్రలో నిలిచారు” అని వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుర్గ ప్రసాద్, నర్సింహా, పురం మహేష్ రెడ్డి, నేరటి శేఖర్, నక్క శీను, సేవా బృంద సభ్యులు ప్రవీణ్, వెంకట నారాయణ, శివ, అరవింద్ రెడ్డి, దేవర్ల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచాలి

**- పచ్చిమట్ల రవీందర్ గౌడ్**



**హుస్నాబాద్, మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రభుత్వ పాఠశాలలో యూనిఫామ్‌లు, మధ్యాహ్న భోజనం, క్రీడా మైదానం, ఉద్యోగ పరీక్షల్లో బెనిఫిట్ మార్కులు వంటి సదుపాయాలు ఉన్నప్పటికీ తల్లిదండ్రులు ప్రైవేట్ స్కూళ్లకే మొగ్గు చూపుతున్నారని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయులే తమ పిల్లలను ప్రైవేట్ స్కూళ్లలో చేర్పించడం ప్రజల్లో అనుమానాలు కలిగిస్తోందని ఆయన అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వాతావరణం, బోధన నాణ్యతపై తల్లిదండ్రులు ప్రశ్నలు వేస్తున్నారని, ఈ అనుమానాలను నివారించే బాధ్యత అధికారులదే అని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తేనే ప్రజల్లో నమ్మకం పెరుగుతుందని, అప్పుడే ప్రభుత్వ పాఠశాలలు నిలదొక్కుకుంటాయని రవీందర్ గౌడ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల మనుగడ కోసం ప్రజా ప్రతినిధులు ఆదర్శంగా నిలవాలని బీఎస్పీ పక్షాన పిలుపునిచ్చారు.

## దర్గా, మసీదులు, ఈద్గాల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు





**-స్వయంగా పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్**



**నందికొట్కూరు, మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నంద్యాల జిల్లా వ్యాప్తంగా బక్రీద్ పండుగ సందర్భంగా దర్గా, మసీదులు, ఈద్గాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ ఐపీఎస్ ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు పోలీసు అధికారులు, సిబ్బంది బందోబస్తు విధులు నిర్వహిస్తున్నారు. భద్రతా చర్యల్లో భాగంగా డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ బృందాలతో పోలీసులు తనిఖీలు చేపట్టి భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ముఖ్యమైన ప్రాంతాల్లో పికెట్లు ఏర్పాటు చేసి, ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పండుగ జరుపుకునేలా చర్యలు తీసుకున్నారు. జిల్లా ఎస్పీ స్వయంగా నంద్యాల పట్టణం తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈద్గాల వద్ద ముస్లిం సోదరులతో మాట్లాడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. “ప్రజలు శాంతియుత వాతావరణంలో పండుగలను జరుపుకుంటూ పోలీసు శాఖకు సహకరించాలి” అని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పీ ఎం. జావళి ఐపీఎస్, తాలూకా ఇన్స్పెక్టర్ ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ 103వ జయంతి వేడుకలు

**తెలుగు జాతి ఆత్మగౌరవానికి చిరస్మరణీయ ప్రతీక**




**నంద్యాల, మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నటసార్వభౌముడు, తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీక, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ నందమూరి తారక రామారావు 103వ జయంతి వేడుకలు గురువారం నంద్యాల కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్, జిల్లా పర్యాటక అధికారి విజయలక్ష్మి తదితరులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డిఆర్ఓ రాము నాయక్ మాట్లాడుతూ, “తెలుగు సినీ, రాజకీయ రంగాలలో ఎన్టీఆర్ సృష్టించిన ప్రభంజనం చిరస్థాయిగా నిలిచిపోతుంది. వెండితెరపై తన అపూర్వ నటనతో కోట్లాది అభిమానుల హృదయాలను గెలుచుకున్న ఎన్టీఆర్, రాజకీయాల్లో ప్రజాహిత పాలనతో తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పారు” అని పేర్కొన్నారు. పౌరాణిక, జానపద, సాంఘిక చిత్రాలలో ఆయన పోషించిన పాత్రలు తెలుగు ప్రజల మదిలో చిరస్థాయిగా నిలిచాయని, ముఖ్యంగా శ్రీరాముడు, శ్రీకృష్ణుడు వంటి దైవిక పాత్రల్లో ఆయన నటన ప్రజల హృదయాల్లో దైవసమాన స్థానం సంపాదించిందని కొనియాడారు. 1923 మే 28న కృష్ణా జిల్లా నిమ్మకూరులో జన్మించిన ఎన్టీఆర్, సాధారణ కుటుంబం నుంచి వచ్చి తన అసాధారణ ప్రతిభతో ప్రపంచవ్యాప్తంగా తెలుగు జాతికి గర్వకారణంగా నిలిచారని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలి కళారంగాన్ని ఎంచుకోవడం ఆయన సంకల్పబలానికి నిదర్శనమని, 1949లో విడుదలైన “మనదేశం” చిత్రంతో సినీరంగ ప్రవేశం చేసి, అనంతరం అనేక చారిత్రక, పౌరాణిక, సామాజిక చిత్రాలలో అజరామర పాత్రలు పోషించి తెలుగు చలనచిత్ర చరిత్రలో చెరగని ముద్ర వేశారని వివరించారు. నటుడిగానే కాకుండా ప్రజానాయకుడిగా కూడా తెలుగు ప్రజల హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించుకున్న మహానుభావుడు ఎన్టీఆర్ అని డిఆర్ఓ రాము నాయక్ అన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ సూర్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ శేషన్న, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, ఉద్యాన శాఖ అధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో మందుల కొరత




**కరీంనగర్, మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రభుత్వ వైద్య కేంద్రమైన 540 పడకల జనరల్ ఆసుపత్రిలో మందుల కొరత తీవ్రంగా ఉందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ 1000 మందికి పైగా ఓపీ రోగులు, మూడు షిఫ్టుల్లో 65 మంది డయాలసిస్ పేషెంట్లు చికిత్స పొందుతున్నారు. రోజూ 15 మేజర్, 20 మైనర్ సర్జరీలు, 15 డెలివరీలు జరుగుతున్నా అత్యవసర ఔషధాల కొరత ఏర్పడింది. ఎంఎస్ఐడీసీ సరఫరాల్లో నిర్లక్ష్యం కారణంగా నిరుపేదలు బయట మెడికల్ షాపుల్లో భారీ ఖర్చులు పెట్టాల్సి వస్తోందని రోగులు వాపోతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సరిపడా మందులు నిల్వలు ఉంచి, ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలి అని వారు కోరుతున్నారు. ప్రజా ఆరోగ్యానికి కీలకమైన ప్రభుత్వ ఆసుపత్రిలో మందుల కొరత ఆందోళన కలిగిస్తోంది.

# ఎదురులేని నాయకుడు ఎన్టీఆర్



**నందికొట్కూరు, మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కలియుగ యుగపురుషుడు, సినీ రంగంలోనూ, సామాజిక సేవలోనూ, రాజకీయాల్లోనూ ఎదురులేని మహానాయకుడు నందమూరి తారక రామారావు సేవలను టిడిపి రాష్ట్ర నాయకుడు డాక్టర్ కాకరవాడ చిన్న వెంకటస్వామి ఘనంగా కొనియాడారు. గురువారం మహానాడులో భాగంగా స్వర్గీయ ఎన్టీఆర్ జయంతి సందర్భంగా నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి నివాసంలో టిడిపి రాష్ట్ర నాయకుల ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. డాక్టర్ వెంకటస్వామి మాట్లాడుతూ, "తెలుగువాడు ఆత్మగౌరవాడిని, తెలుగుజాతి ఖ్యాతిని ప్రపంచానికి పరిచయం చేసిన మహనీయుడు ఎన్టీఆర్. పార్టీ స్థాపించి కేవలం తొమ్మిది నెలల్లోనే తిరుగులేని మెజారిటీతో ముఖ్యమంత్రి పదవిని అధిరోహించి తెలుగు వారి ఘనకీర్తిని చాటిచెప్పారు. ఆంధ్ర రాష్ట్రాన్ని యావత్ ప్రపంచానికి పరిచయం చేసిన మహానుభావుడు తనదైన శైలిలో ముద్ర వేసి ఎదురులేని నాయకుడిగా నిలిచారు" అని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కౌన్సిలర్ లాలు, మాజీ ఉర్దూ అకాడమీ డైరెక్టర్ సుకూర్ మియా, జి. శ్రీనివాసులు, హుస్సేన్ రెడ్డి, మురళి, తెలుగు యువత నాయకులు జాన్, మున్నా, రవీంద్ర, శివ, శ్యామ్, అంజి, గోరంట్ల, మౌలాలి, మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

# కందికట్కూర్ ఎల్లమ్మ తల్లి జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

**ఇల్లంతకుంట, మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**





మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ కందికట్కూర్ గ్రామంలో జరుగుతున్న ఎల్లమ్మ తల్లి జాతర మహోత్సవాలకు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. గ్రామ ప్రజలు, మహిళలు, యువకులు ఘన స్వాగతం పలికారు. సంప్రదాయ కళారూపాలు, డప్పు వాయిద్యాలు, మంగళహారతులతో స్వాగతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ దేవతల జాతరలు ప్రజల ఐక్యతకు, ఆధ్యాత్మిక భావన పెంపొందించడంలో కీలకమని అన్నారు. నియోజకవర్గ ప్రజలందరికీ అమ్మవారి దీవెనలు ఉండాలని, రైతాంగం అభివృద్ధి చెందాలని ప్రార్థించారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, విద్యుత్, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. జాతరలో మహిళలు బోనాలు సమర్పించగా, యువకులు సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఊట్కూరి రమణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఐరెడ్డి చైతన్య మహేందర్ రెడ్డి, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళా సంఘాలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఎమ్మెల్యే ప్రజల సమస్యలు అడిగి తెలుసుకోవడం గ్రామస్థులను ఆకట్టుకుంది.

# షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్‌ను పరిశీలించిన అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

-వర్షాలకు తడిసిన ధాన్యం కొనుగోళ్లపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు



**షాద్‌నగర్, మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డును అదనపు జిల్లా కలెక్టర్ చంద్రారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యాపారులతో సమావేశమై, వర్షాలకు తడిసిన ధాన్యం విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. డీఎం సివిల్ సప్లైస్ కార్పొరేషన్, జిల్లా పౌర సరఫరాల అధికారికి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి, వారం రోజుల్లోగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే జిల్లా వ్యవసాయ అధికారికు రైతులు సన్నరకం ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 500 బోనస్ అందిస్తున్నందున రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, డైరెక్టర్ కరుణాకర్, వ్యవసాయ శాఖ అధికారులు, వ్యాపారులు పాల్గొన్నారు.

# వంగూరులో ఘనంగా బక్రీద్ వేడుకలు

-ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు

- సోదరభావానికి ప్రతీక



**వంగూరు, మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వంగూరు మండల కేంద్రంలో గురువారం బక్రీద్ పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, ముస్లిం సోదరసోదరీమణులు ఒకరికి ఒకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. "బక్రీద్ పండుగ ప్రేమ, త్యాగం, సహనం, సోదరభావానికి ప్రతీక" అని మజీద్ కమిటీ చైర్మన్ ఖలీల్ పేర్కొన్నారు. ఆయనతో పాటు వైస్ చైర్మన్ ఖాయమ్ ఖాన్, గాఫుర్, హమీద్, ఆరిఫ్ ఖాన్, షమీము ఖాన్, జహంగీర్, షన్వాజ్, రఫీ, సలీం, ఖలీల్ అయూబ్ ఖాన్, జానీ, జావీద్, ఖదీర్, యూసఫ్ ఖాన్, అల్లాజీ, అఖిల్, సీజు, దుర్బేష్, చంద్ పాషా తదితర ముస్లిం పెద్దలు, యువకులు పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం పండుగ శాంతియుత వాతావరణంలో జరగాలని, అల్లాహ్ ఆశీస్సులు ప్రజలందరికీ కలగాలని ఆకాంక్షలు వ్యక్తం చేశారు.

# ప్రజా సంక్షేమమే మా ముఖ్యమంత్రి లక్ష్యం





**నందికొట్కూరు, మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజా సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తూ, ప్రజాసేవలో తనదైన శైలిని ప్రతిబింబిస్తున్నారని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య, పార్లమెంట్ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జీలు పేర్కొన్నారు. గురువారం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న పసుపు పండగ మహానాడు రెండవ రోజు కార్యక్రమంలో భాగంగా, నందికొట్కూరు పట్టణం బ్రాహ్మణకొట్కూరు క్లస్టర్ నెం. 2, 5, 6 ఆధ్వర్యంలో మహానాడు నిర్వహించారు. ఈ సందర్భంగా నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇన్‌చార్జి



మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో, టిడిపి శ్రేణులు స్వర్గీయ నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి 103వ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వర్చువల్ మహానాడు టిడిపి అబ్జర్వర్ వెంకట శివుడు యాదవ్, నందికొట్కూరు మండల కన్వీనర్ మాండ్రా సురేంద్రనాథ్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి, బ్రాహ్మణకొట్కూరు సొసైటీ చైర్మన్ హరి సర్వోత్తమ్ రెడ్డి, టిడిపి యువత మధు, యువ నాయకులు ఉదయ్ కిరణ్ రెడ్డి, బిజినవేముల సర్పంచ్ రవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు. నందికొట్కూరు పరిధిలోని 2, 5, 6 క్లస్టర్ ఇన్‌చార్జీలు, టిడిపి మహిళా నాయకురాలు, బూత్ ఇన్‌చార్జీలు, యూనిట్ ఇన్‌చార్జీలు, కె.ఎస్.ఎస్. సభ్యులు, మహిళలు, పార్టీ కార్యకర్తలు ఉత్సాహంగా హాజరై మహానాడు విజయవంతం చేశారు.

# ఐకెపి కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

రైతుల సమస్యలపై అధికారులతో చర్చ



**మర్రిగూడ, మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండల కేంద్రంలోని ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల రైతుల పాలిట శాపంగా మారింది. రైతులు పండించిన ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలి. అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని కూడా బేషరత్తుగా కొనుగోలు చేయాలి" అని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ నేరుగా రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చండూరు ఆర్డీవో శ్రీదేవితో చర్చించి, ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ మండల కన్వీనర్ బుర్ర శేఖర్, ఈదుల బిక్షం రెడ్డి, రఘుమయ్య, నిరంజన్, మోదుగుల రాజుతో పాటు సిపిఐ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల ఆరోగ్య పథకం విధి విధానాలు వెంటనే విడుదల చేయాలి -- టీపీటీఎఫ్



అధ్యక్షులు చకినాల అనిల్ కుమార్



ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి

## రాష్ట్ర కమిటీ సమావేశంలో కీలక తీర్మానాలు

**హైదరాబాద్, మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర కమిటీ సమావేశం గురువారం రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు సి. హెచ్. అనిల్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయ, ఉద్యోగ రంగ సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి విద్యారంగ పరిస్థితులు, ఉపాధ్యాయ ఉద్యమాలపై నివేదికను ప్రవేశపెట్టారు. అనంతరం కమిటీ పలు కీలక తీర్మానాలు చేసింది. ఉద్యోగుల ఆరోగ్య పథకంకు సంబంధించి అందరికీ ఆమోదయోగ్యమైన విధి విధానాలు వెంటనే విడుదల చేసి, ఆ తర్వాతే కాంట్రిబ్యూషన్ కోరాలని నిర్ణయించారు. పీఆర్సీ నివేదికను తెప్పించి వెంటనే అమల్లోకి తేవాలని, కరువు భత్యాలను కొత్త పీఆర్సీలో సవరించబడే శాతం మేరకు చెల్లించాలని డిమాండ్ చేశారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలలకు బదులుగా ఉన్న పాఠశాలల బాగోగులపై దృష్టి సారించి, మెరుగైన విద్య కోసం కృషి చేయాలని సూచించారు. అన్ని ప్రాథమిక పాఠశాలలకు పూర్వ ప్రాథమిక సెక్షన్లు కేటాయించి ప్రాథమిక విద్య బలోపేతానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాధ్యాయుల సర్వీసు రికార్డుల ఆన్లైన్ నమోదు తేదీని జూన్ 30 వరకు పొడిగించాలని తీర్మానించారు. పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుల పెన్షన్ సొమ్మును వెంటనే చెల్లించాలని, 2025--26 పదవ తరగతి మూల్యాంకన భృతిని అన్ని జిల్లాలకు తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో అసోసియేట్ అధ్యక్షులు జీ. తిరుపతి రెడ్డి, అదనపు ప్రధాన కార్యదర్శి ముత్యాల రవీందర్, ఉపాధ్యక్షులు పి. నారాయణమ్మ, డి. శ్రీనివాస్, ఎం. లక్ష్మయ్య యాదవ్, బి. రాజు, కార్యదర్శులు రావుల రమేష్, ఎస్. విజయ్, బి. రమేష్, డి. రాజయ్య, వై. పద్మ తదితరులు పాల్గొన్నారు.

# అదనపు కట్న వేధింపులకు వివాహిత బలి



**గంగాధర, మే 28( నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గోపాల్రావుపల్లి గ్రామానికి చెందిన నాగరపు లాస్య అలియాస్ నలువాల మమత (32) అదనపు కట్న వేధింపులు తాళలేక గడ్డి మందు సేవించి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. ఎనిమిదేళ్ల క్రితం నాగరపు అనిల్‌తో వివాహం జరిగిన మమతను భర్తతో పాటు అత్తింటివారు అదనపు కట్నం కోసం మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ నెల 25న గడ్డి మందు సేవించిన ఆమెను కరీంనగర్ అపెక్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ 28వ తేదీ తెల్లవారుజామున 2:33 గంటలకు మృతి చెందింది. మృతురాలి తండ్రి నలువాల ఓదయ్య ఫిర్యాదు మేరకు భర్తతో పాటు మామ, అత్త, ఆడబిడ్డలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గంగాధర ఎస్సై బి. వంశీకృష్ణ తెలిపారు. అదనపు కట్న వేధింపులు మరోసారి ప్రాణం తీసిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.

## మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడిని సన్మానించిన జెన్నపల్లి పద్మకృష్ణ





**మహేశ్వరం, మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మండల కేంద్రంలోని మాణిక్యమ్మగూడ గ్రామ సర్పంచ్, తెలంగాణ పంచాయతీ రాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెన్నపల్లి పద్మకృష్ణ ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్నారు. మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా మునగపాటి నవీన్ ఏకగ్రీవంగా ఎన్నికవగా, ప్రధాన కార్యదర్శిగా నాగారం సర్పంచ్ లింగం, ఉపాధ్యక్షుడిగా అరుణ గోపాల ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జెన్నపల్లి పద్మకృష్ణ నూతనంగా ఎన్నికైన మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ, “సర్పంచుల సంఘం ప్రజా సమస్యల పరిష్కారానికి, గ్రామీణాభివృద్ధికి వేదిక కావాలి. ప్రజలతో అనుబంధం పెంచుకుని, పంచాయతీ రాజ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలి” అని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు పాల్గొని, ఎన్నికైన నాయకులను ఘనంగా సన్మానించారు.

## ఆర్యవైశ్య మహాసభ పట్టణ అధ్యక్ష ఎన్నికల బరిలో ఇద్దరు అభ్యర్థులు

**మే 31న వాసవి ఆలయంలో పోలింగ్**

**నాగర్‌కర్నూల్, మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ పట్టణ అధ్యక్ష ఎన్నికలకు సంబంధించి మూడు నామినేషన్లు దాఖలు కాగా, గురువారం ఎలిమే సత్యం తన నామినేషన్ ఉపసంహరించుకోవడంతో ఎన్నికల బరిలో ఇద్దరు అభ్యర్థులు మిగిలారు. వీరు బిల్లకంటి హరిబాబు, వాస రమేష్ అని జిల్లా ఎన్నికల కన్వీనర్ మాచిపెద్ది శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31న ఆదివారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఎన్నికలు జరగనున్నాయి. ఓటర్ల జాబితాలో పేరు ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించి పట్టణ అధ్యక్ష ఎన్నిక విజయవంతం చేయాలని ఎన్నికల కన్వీనర్ విజ్ఞప్తి చేశారు.

## మహ్మద్ ప్రవక్త బోధనలు ఆచరణీయం

**- బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా**

**ఆమనగల్లు, మే 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మహ్మద్ ప్రవక్త భోదించిన సూత్రాలు మానవళికి ఆచరణీయం అని మౌలాన తెలిపారు. గురువారం కడ్తాల్ పట్టణ కేంద్రంలో ముస్లింలు బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈద్గా మస్జిద్ల నుంచి ముస్లింలు ఈద్గా వరకు ర్యాలీగా వెళ్లారు. త్యాగాలకు ప్రతీక బక్రీద్ అని మౌలానాలు ప్రపంచ శాంతి కోరుతూ ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అనంతరం ఒకరినొకరు



ఆలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ చెప్పుకొన్నారు. పొటేళ్లను బలిచ్చి బంధువులు, స్నేహితులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా ముదిరాజ్, మండల అధ్యక్షుడు బిచ్యా నాయక్, సర్పంచ్ రాయికంటి బిక్షపతి, ఉపసర్పంచ్ యాదగిరి రెడ్డి, బిక్య నాయక్, ఎర్రోళ్ల రాఘవేందర్, కృష్ణ నాయక్ లు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఈద్గాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్త్ ఏర్పాటు చేశారు.

## మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన కౌన్సిలర్ రాము

**ఆమనగల్లు, మే 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు మూర్తుజపల్లికి చెందిన కానుగుల పెద్దయ్య బుధవారం



అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ప్రముఖ సంఘ సేవకులు, 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము గురువారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైర్యం కల్పించారు. తన వంతు సహాయంగా ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట కౌన్సిలర్ కాలే యశోదమ్మ వీరయ్య, నాయకులు కాలే విక్రమ్, శ్రీను నాయక్ తదితరులు ఉన్నారు.

# త్యాగానికి ప్రతీక బక్రీద్

**- నియోజకవర్గ వ్యాప్తంగా ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు**

**- పండుగ శుభాకాంక్షలు తెలిపిన ప్రజా ప్రతినిధులు**



**ఆమనగల్లు, మే 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండగను కల్వకుర్తి నియోజకవర్గ వ్యాప్తంగా ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. గురువారం ముస్లింలు ఆయా మండలాల కేంద్రంలోని ఈద్గాకు తరలివెళ్లారు. ఉదయం 9 గంటల నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు నమాజ్ చేయించారు. చుట్టుపక్కల గ్రామాల ముస్లింలు సైతం ఆమనగల్లు ఈద్గాకు వచ్చి ప్రార్థనలు చేశారు. ప్రార్థనలకు వచ్చే సమయంలో ఈద్గా దగ్గర ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. కల్వకుర్తి పాటు వెల్దండ, ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల్, మాడుగుల తదితర మండలాల్లోని ఈద్గాల దగ్గర ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండల కేంద్రాలతో పాటు పలు గ్రామాల్లో ఉన్న ఈద్గాల దగ్గర ముస్లింలు బక్రీద్ ప్రార్థనలు చేశారు. ప్రార్థనల అనంతరం పూర్వీకుల సమాధుల వద్ద పుష్పగుచ్చాలు ఉంచి ప్రార్ధనలు చేశారు.
ఈద్గా దగ్గర వివిధ పార్టీల నాయకులు బక్రీద్ పండగను పురస్కరించుకొని ముస్లింలకు పండగ శుభాకాంక్షలు తెలపడానికి వివిధ పార్టీల నాయకులు ఈద్గాకు వచ్చారు. ప్రార్థనల అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ పత్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, సర్పంచ్ బిక్షపతి లు వేర్వేరుగా ముస్లింలకు బక్రీద్ పండగ శుభాకాంక్షలు తెలిపారు. వీరితో పాటు వివిధ పార్టీల నాయకులు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, కౌన్సిలర్ పాపిశెట్టి రాము, శ్రీను నాయక్ ముస్లింలకు బక్రీద్ పండగ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం మైనార్టీల సంక్షేమానికి తాము కట్టుబడి ఉన్నామని, ప్రతి ఒక్కరూ దేశ పురోగాభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో సాధికారత సాధించాలి



**ఎలిగేడు, మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మహిళలు అన్ని రంగాల్లో సాధికారత సాధించాలని సర్పంచ్ మద్దెల రమాదేవి-- సంపత్ అన్నారు. ఎలిగేడు మండలంలోని ర్యాకల్దేవుపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో మెన్సురేషన్ హైజిన్ డే సందర్భంగా మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని ఆమె ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, “ప్రతి ఇంటి నుండి ప్లాస్టిక్, తడి, పొడి చెత్తను వేరు చేసి సక్రమంగా నిర్వహించాలి. ప్లాస్టిక్ వాడకం వలన కలిగే దుష్పరిణామాలు, ఆరోగ్య సమస్యలపై మహిళలు ప్రత్యేక శ్రద్ధ చూపాలి” అని సూచించారు. మహిళలు ఆరోగ్య పరిరక్షణతో పాటు గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బొడిగే శివకృష్ణ గౌడ్, వార్డు సభ్యులు ఆసంపెల్లి స్వప్న, అంగన్వాడి టీచర్ ఓదెశ్వరి, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

## తెలంగాణలో టీడీపీకి పూర్వ వైభవం వస్తుంది

**- అండేకార్ యాదిలాల్**



**ఆమనగల్లు, మే 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తెలంగాణ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం రానున్నదని టిడిపి రాష్ట్ర నాయకులు, ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు అండేకార్ యాదిలాల్ అన్నారు. గురువారం హైదరాబాదులో ఎన్టీఆర్ ఘాటు వద్ద మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 103వ జయంతి వేడుకల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎన్టీఆర్ భవన్లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి దేవి చేతుల మీదుగా ఆయన ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా అండేకార్ యాదిలాల్ మాట్లాడుతూ.. నాడు ఉమ్మడి రాష్ట్రంలో పేదల అభివృద్ధి, సంక్షేమం కోసం కృషిచేసిన తెలుగుదేశం పార్టీని ప్రజలు ఆదరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో టీడీపీ జెండా ఎగరడం ఖాయమని టీడీపీకి పూర్వ వైభవం రానున్నట్లు ఆయన పేర్కొన్నారు. వారి వెంట నాయకులు పంచాక్షరి, నరసింహ గుప్తా, గాజుల పద్మనాభం, వజ్ర లింగం, శ్రీనాథ్ తదితరులున్నారు.

# ఆరోగ్య ప్రదాయిని.. అల్లనేరేడు

**- షుగరు దివ్య ఔషధం**

**- మార్కెట్లో జోరుగా విక్రయాలు**



**ఆమనగల్లు, మే 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
అల్లనేరేడును ఔషధ ఫలంగా పిలుస్తారు.. వేసవిలో మనకెంతో ఉపయోగపడే పండ్లలో వగరు. తీపి, పులుపు మేళవింపు రుచితో ఉన్న అల్లనేరేడు పండ్లు శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. వేసవిలో వేడిమి నుండి ఉపశమనం, చలువను అందిస్తాయి. ఆకలి పుట్టిస్తాయి. పైత్యాన్ని తగ్గిస్తాయి. మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఇది దివ్య ఔషధంగా పనిచేస్తుంది. గుండె రక్తంలోని ఉష్ణాన్ని హరిస్తుందని వైద్యులు చెబుతున్నారు. సీజనల్ గా లభించే ఈ పండ్లు తినేందుకు ప్రజలు ఆసక్తి చూపుతుంటారు.

ఉపయోగాలు

- అల్లనేరేడు పండ్లతో పాటు ఆకులు, కాండం కూడ ఔషధంగా ఉపయోగపడుతుంది.
-సూక్ష్మ క్రిములు దరి చేరవని శుభకార్యాల్లో అల్లనేరేడు ఆకులను కడతారు.
-అల్లనేరేడు చెక్క నుంచి తీసిన కషాయం అతిసారం, విరోచనాలు, జ్వరాన్ని తగ్గిస్తుందని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు.
- సీ-విటమిన్ పుష్కలంగా ఉండటంతో షుగర్ వ్యాధిగ్రస్తులు ఈ పండ్లు తినడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.
- అల్లనేరేడు పండ్ల విత్తనాలు ఎండ బెట్టి చూర్ణం చేసి తీసుకుంటే మధుమేహం నివారించవచ్చని, నోటి దుర్వాసన పోతుందని, పండ్ల చెట్టు పుల్లలతో పండ్లు తోమితే చిగుళ్లు ఆరోగ్యంగా ఉంటాయి.

**అందుబాటులో హైబ్రీడ్ మొక్కలు**

ప్రస్తుతం అల్లనేరేడుకు సంబంధించిన మొక్కలు మార్కెట్లో పుష్కలంగా లభిస్తున్నాయి. ఇళ్లలో, పెరట్లలో, వ్యవసాయ క్షేత్రాల్లో నాటేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. కొందరులాల్ తోటలా పెంచేస్తున్నారు. గతంలో అల్లనేరేడు చెట్లు అంటే పెద్ద పెద్దగా కనిపించేవి. ప్రస్తుతం మార్కెట్లో హైబ్రీడ్ మొక్కలు లభిస్తున్నాయి. అల్లనేరేడు పండ్లకు మార్కెట్లో డిమాండ్ అధికంగా ఉండటంతో చాలా మంది రైతులు వ్యవసాయ క్షేత్రాల్లో విధిగా ఈ పండ్ల చెట్లను నాటుతున్నారు.

కేజీకి రూ.200

ఆమనగల్లు పరిసర ప్రాంతంలో రైతులు మామిడి, జామ తోటల్లో అల్లనేరేడు చెట్లను సైతం పెంచుతున్నారు. దీంతో ఈ ప్రాంతంలో ఈ పండ్లు అధికంగా లభిస్తున్నాయి. ప్రస్తుతం అల్లనేరుడు పండ్ల దిగుబడి ప్రారంభమయింది. రోడ్ల వెంట ఎక్కడ చూసినా గంపల్లో, తోపుడు బండ్లపై అల్లనేరేడు పండ్లను విక్రయిస్తున్నారు. కేజీ పండ్లు రూ.250 వరకు ధర పలుకుంది.

# ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది





**- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

**-నల్లగొండ ఈద్గా వద్ద బక్రీద్ ప్రత్యేక ప్రార్థనలు**

**నల్లగొండ,మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నల్లగొండ పట్టణంలోని మునుగోడు రోడ్డులోని ఈద్గా వద్ద గురువారం జరిగిన బక్రీద్ వేడుకల్లో రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనలు అనంతరం ఆయన ముస్లిం సోదరసోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.మంత్రి మాట్లాడుతూ, "బక్రీద్ పండుగ అల్లాహ్ పట్ల అపారమైన విశ్వాసాన్ని, త్యాగ నిరతిని చాటిచెప్పే పవిత్రమైన రోజు. ప్రవక్త హజ్రత్ ఇబ్రహీం గారి త్యాగాన్ని స్మరించుకుంటూ జరుపుకునే ఈ పండుగ మానవాళికి గొప్ప జీవన సందేశం. మనకున్నదాన్ని పేదలతో పంచుకోవడం, సమాజ శ్రేయస్సు కోసం స్వార్థాన్ని వదిలేయడం ఈ పండుగ అసలు ఉద్దేశం" అని వివరించారు.అతను రాహుల్ గాంధీ చేపట్టిన లి"భారత్ జోడో యాత్ర"లిను ప్రస్తావిస్తూ, అన్ని వర్గాలు, అన్ని మతాల ప్రజలు సమానమేనని, ఐక్యతతో ముందుకు సాగాలని ఆ యాత్ర ఇచ్చిన సందేశాన్ని గుర్తుచేశారు. మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించడం వల్ల విద్యా, ఉద్యోగ అవకాశాలు పెరిగాయని, కాంగ్రెస్ పార్టీ సెక్యులర్ విలువలకు నిలువెత్తు నిదర్శనం అని అన్నారు.నల్లగొండలో మతసామరస్యానికి, గంగా--జమునా తెహజీబ్‌కు నిలువెత్తు సాక్ష్యం ఉందని, మూడు దశాబ్దాలుగా ఏ చిన్న ఘటన లేకుండా హిందూ--ముస్లింలు కలిసి పండుగలు జరుపుకుంటున్నారని మంత్రి పేర్కొన్నారు. "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ముస్లిం మైనారిటీల సంక్షేమానికి కట్టుబడి ఉంది. విద్య, ఉపాధి రంగాల్లో మైనారిటీ సోదరులు ఉన్నత స్థానాలకు ఎదగాలని మా లక్ష్యం. ఆధునిక పాఠశాలలు, జాబ్ మేళాలు, షాదిఖానా నిర్మాణం వంటి కార్యక్రమాలు త్వరలోనే పూర్తి చేస్తాం" అని హామీ ఇచ్చారు."ఈ పవిత్ర బక్రీద్ పర్వదినాన అల్లాహ్ కరుణాకటాక్షాలు మన తెలంగాణ రాష్ట్రంపై, ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి ఇల్లాలు, ప్రతి బిడ్డ సంతోషంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నాను" అని మంత్రి వెంకట్ రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, ఎస్పీ శరత్ చంద్ర పవార్, డీఎస్పీ శివరాం రెడ్డి, మునిసిపల్ కమిషనర్, మేయర్, ఉపమేయర్, గ్రంథాలయ చైర్మన్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

# నల్గొండ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ

**-ప్రజలకు మరింత అందుబాటులోకి రావాలి గ్రామ పోలీసు వ్యవస్థ**

**-- జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్**





**నల్లగొండ, మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ గురువారం నల్గొండ గ్రామీణ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలోని శాంతిభద్రతల పరిస్థితి, పెండింగ్ కేసుల దర్యాప్తు, రికార్డుల నిర్వహణ, పోలీసు సిబ్బంది పనితీరును సమీక్షించారు.ఎస్పీ స్టేషన్ రికార్డులు, నేరానికి సంబంధించిన ఆస్తులు, స్వాధీనం చేసుకున్న వాహనాలు, సీసీటీవీ కెమెరాల పనితీరు, కోర్టు సంబంధిత రికార్డులను పరిశీలించి పలు సూచనలు జారీ చేశారు. ప్రజలకు వేగవంతమైన, సమర్థవంతమైన సేవలు అందేలా ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా స్వీకరించి, తక్షణ న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, "గ్రామ పోలీసు వ్యవస్థ ప్రజలకు మరింత అందుబాటులో ఉండేలా బలోపేతం చేయాలి. గ్రామాల్లో అనుమానాస్పద కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచి, సమాచార నెట్వర్క్‌ను సమర్థవంతంగా వినియోగించాలి" అని సూచించారు.దొంగతనాలు, దోపిడీలు, ఆస్తి సంబంధిత నేరాలను నివారించేందుకు జాతీయ రహదారులు, గ్రామ శివార్లు, ఏకాంత ప్రదేశాల్లో పగలు--రాత్రి పటిష్టంగా గస్తీ నిర్వహించాలని ఆయన పోలీసులను ఆదేశించారు. పాత నేరస్థుల కదలికలను నిశితంగా గమనించి, రౌడీషీటర్లు, అనుమానాస్పద వ్యక్తులను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని సూచించారు.అదేవిధంగా సైబర్ నేరాలపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. "ఏవైనా అనుమానాస్పద సంఘటనలు గమనిస్తే వెంటనే డయల్--100కు లేదా స్థానిక పోలీసులకు తెలియజేయాలి" అని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వ పాఠశాలల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**- ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ముక్తాల శంతన్**




**నాగర్‌కర్నూల్, మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో గురువారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జిల్లా కన్వీనర్ ముక్తాల శంతన్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత, ఉపాధ్యాయుల ఖాళీలు, తగిన విద్యా సామగ్రి లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత దయనీయంగా ఉందని, ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు విద్యను వ్యాపారంగా మార్చి అధిక ఫీజులు వసూలు చేస్తూ మధ్యతరగతి, పేద కుటుంబాలను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నాయని విమర్శించారు. విద్య హక్కు అయినప్పటికీ, కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు చట్టాన్ని పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నాయని, ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైన మొదటి రోజునే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్‌లు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని శంతన్ గుర్తుచేశారు. ముఖ్యంగా పేద, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత సీట్లు కేటాయించే విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఫీజు నియంత్రణ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేసి, అనుమతులు లేకుండా నడుస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే విద్యాసంస్థలను ఉపేక్షించరాదని శంతన్ స్పష్టం చేశారు.ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంగనమోని బంగారు బాబు, నగర కార్యదర్శి ప్రసాద్ కుమార్, సంయుక్త కార్యదర్శులు శివ, విష్ణు, నాయుడు తదితర ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

# అవయవ దానంతో మానవత్వం చాటుకున్న సుప్రియ



**జగిత్యాల, మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** జగిత్యాల పట్టణానికి చెందిన సుప్రియ (25) స్కూటీ నేర్చుకుంటూ ప్రమాదానికి గురై తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ హైదరాబాదులోని యశోద ఆసుపత్రిలో బ్రెయిన్ డెడ్‌గా మారింది. గత మూడు రోజుల పోరాటం అనంతరం ఆమె తుది శ్వాస విడిచింది.ఈ పరిస్థితిలో భర్త అక్కపెల్లి ప్రవీణ్, కుటుంబ సభ్యులు ఆమె అవయవాలను స్వచ్ఛందంగా దానం చేయడానికి ముందుకు రావడంతో జీవన్ దాన్ ప్రతినిధులు గుండె, ఊపిరితిత్తులు, కళ్ళు, మూత్రపిండాలు, కాలేయం వంటి అవయవాలను సేకరించారు. సుప్రియ అవయవాలతో పలువురి జీవితాల్లో కొత్త వెలుగులు ప్రసరించాయి అని వైద్యులు, ప్రతినిధులు కొనియాడారు.సుప్రియకు ఇద్దరు చిన్నారులు తేజశ్రీ (6), వైష్ణక (3) ఉన్నారు. ఆమె అకాల మరణం కుటుంబాన్ని, ప్రాంత ప్రజలను కన్నీటి పర్యంతం చేసింది. అయితే అవయవ దానం ద్వారా చిరంజీవిగా మిగిలిపోయిందని పట్టణ ప్రముఖులు ప్రశంసించారు.సుప్రియ ఉదంతం మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది.

# బక్రీద్ త్యాగం, విశ్వాసానికి ప్రతీక



**ఆమనగల్లు, మే 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** బక్రీద్ పర్వదినం త్యాగానికి ప్రతీక అని, పండుగలతో మత సామరస్యం, సోదర భావం పెంపుందుతుందని సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా అన్నారు. బక్రీద్ పండుగను పురస్కరించుకొని కడ్తాల్ మండల కేంద్రంలో ఈద్గా వద్ద గురువారం నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బక్రీద్ పర్వదిన విశిష్టతను కొనియాడారు. ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో శాంతి యుతంగా పండుగ జరుపుకోవాలని కోరారు. ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మసీద్ కమిటీ నిర్వాహకులు సింగిల్ విండో చైర్మన్ ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ బిక్షపతి, ఉపసర్పంచ్ యాదగిరి రెడ్డి, సీఐ సైదీరెడ్డి, ఎస్ఐ వరప్రసాద్ వార్డు సభ్యులు ఎర్రోల రాఘవేందర్, నాయకులు హనుమా నాయక్, యాటా నర్సింహ, బిక్యా నాయక్, బీచ్య నాయక్, పాండు, తదితరులు పాల్గొన్నారు.

# అధికమాస వాయినాల మహోత్సవం

**వాసవి వనిత వాగ్దేవి క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహణ**



**కరీంనగర్, మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జ్యేష్ఠ అధికమాసం సందర్భంగా వాసవి వనిత వాగ్దేవి క్లబ్ ఆధ్వర్యంలో కరీంనగర్ అశోక్‌నగర్‌లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వాసవి అమ్మవారికి 33 రకాల అధిక వాయినాలు భక్తిశ్రద్ధలతో సమర్పించగా, 33 మంది బ్రాహ్మణ ముత్తైదువులకు తినుపదార్థాలు, పండ్లు, వస్త్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఐఇసి అధికారి జంధ్యం మాధవి -- మధుకర్ దంపతులు, జిల్లా కోఆర్డినేటర్ ఎల్లంకి ప్రదీప్, రీజియన్ చైర్‌పర్సన్ సూర గీత, రీజియన్ సెక్రటరీ మాడిశెట్టి ఉమాదేవి -- గోపాల్, క్లబ్ అధ్యక్షులు గంప హరిణి, ప్రధాన కార్యదర్శి శకేశెట్టి విశాల, కోశాధికారి ముస్త్యాల సమత, ఉపాధ్యక్షులు బొడ్ల సుప్రియ, సిరిపురం మాధురి, ప్రోగ్రామ్ ఇన్‌చార్జ్ వొజ్జల రాజమణితో పాటు క్లబ్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.భక్తులకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐఇసి అధికారి జంధ్యం మాధవి -- మధుకర్ దంపతులు స్పాన్సర్‌గా వ్యవహరించారు. అదేవిధంగా కూల్‌డ్రింక్స్‌ను మురికి భాగ్యలక్ష్మి -- శ్రీనివాస్, కాసనగొట్టు భాగ్యలక్ష్మి -- శంకర్ అందించగా, 33 చీరలను ఇట్ట సాహితీ -- శ్రీనాథ్ స్పాన్సర్ చేశారు.క్లబ్ సభ్యులందరూ కలిసి 33 మంది బ్రాహ్మణ ముత్తైదువులకు వాయినాలు సమర్పించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వాసవి వనిత వాగ్దేవి క్లబ్ తరఫున సహకరించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వాసవి మాత జీవిత చరిత్ర పారాయణం కూడా నిర్వహించారు.

# ముస్లిం మైనార్టీ సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన చారకొండ ఎస్సై వీరబాబు



**చారకొండ, మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చారకొండ మండల పరిధిలోని జూపల్లి గ్రామంలో బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం మైనార్టీ సోదరులను కలిసిన ఎస్సై వీరబాబు ఈద్గా వద్ద ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ, "ఇస్లాం మతం పవిత్రమైన త్యాగానికి ప్రతీక. బక్రీద్ పండుగ ఆ త్యాగ నిరతిని మనకు గుర్తుచేస్తుంది" అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అనూష జగపతి, మాజీ సర్పంచ్ బాలరాజ్, ముస్లిం మైనార్టీ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. పండుగ శాంతియుత వాతావరణంలో జరగాలని, ప్రజలందరూ సోదరభావంతో కలిసిమెలిసి ఉండాలని ఎస్సై వీరబాబు ఆకాంక్షించారు.

# ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు



**పెద్దపల్లి, మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు జయంతి సందర్భంగా పెద్దపల్లి పట్టణంలోని అయ్యప్ప ఆలయ ఆవరణలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు పాల్గొన్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు కూడా హాజరై ఎన్టీఆర్ సేవలను స్మరించుకున్నారు. తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ఎన్టీఆర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.


# ఎలిగేడులో బక్రీద్ వేడుకలు

**జామా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు**



జామా మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

**ఎలిగేడు, మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండలంలోని జామా మసీదులో గురువారం ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. త్యాగానికి ప్రతిరూపం, మానవత్వానికి మార్గదర్శకం, విశ్వాసానికి నిలువెత్తు సాక్ష్యం, కరుణా--శాంతి వెల్లివిరిసే సామరస్యానికి ప్రతీకగా ఈద్--ఉల్--అదా పవిత్ర దినం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇమామ్ సలీం ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు అల్లాహ్ ఆశీస్సులు కోరుతూ ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మండల ముస్లిం సోదరులు రహీం, చాంద్ భాష, రజవెల్లి, షకీల్, యాసిన్, ముస్తఫా, రియాజ్, మైనుద్దీన్, సలీం, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.



కుద్బా ప్రసంగాన్ని చదివి వినిపిస్తున్న ఇమామ్ సలీం

# శ్రీశైలం గో సంరక్షణకు విరాళం

**రూ. 11,11,116/- అందజేసిన ఇందుకూరి వెంకటరామకృష్ణంరాజు కుటుంబం**



**శ్రీశైలం, మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హైదరాబాద్‌కు చెందిన భక్తుడు ఇందుకూరి వెంకటరామకృష్ణంరాజు గురువారం శ్రీశైలం దేవస్థానం గో సంరక్షణ నిధికి రూ. లి11,11,116/-లిల చెక్కును దేవస్థానం ఈవో ఎం. శ్రీనివాసులకు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ, తనతో పాటు కుటుంబ సభ్యులు ఇందుకూరి పద్మావతి, ఇందుకూరి వెంకట విట్టల్ సాయితేజరాజు, ఇందుకూరి ప్రణీతరాజు పేరుతో ఈ విరాళాన్ని సమర్పించినట్లు తెలిపారు. అనంతరం ఆలయ మర్యాదలతో స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

# మార్కెట్ యార్డును సందర్శించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



**ఇల్లంతకుంట, మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ ఇల్లంతకుంట మార్కెట్ యార్డును సందర్శించి రైతులతో ముఖాముఖి మాట్లాడారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ, తూకం సమస్యలు, చెల్లింపుల ఆలస్యం వంటి అంశాలను రైతులు వివరించగా, ఎమ్మెల్యే వెంటనే అధికారులను ఆదేశించి కొనుగోళ్లు పారదర్శకంగా, సకాలంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాలని స్పష్టం చేశారు. అలాగే సన్‌ఫ్లవర్ సాగు చేస్తున్న రైతులతో ప్రత్యేకంగా మాట్లాడి పంట పురోగతి, మార్కెట్ పరిస్థితులు తెలుసుకున్నారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. రైతులు పండించిన ప్రతి గింజకు గౌరవం దక్కేలా చర్యలు తీసుకుంటాం అని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐరెడ్డి చైతన్య మహేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ అయిలయ్య, ఉట్కూరి రమణ రెడ్డి, స్థానిక కాంగ్రెస్ నాయకులు, రైతు నాయకులు, అధికారులు పాల్గొన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే సత్యనారాయణ హామీ ఇచ్చారు.

# ఆశా వర్కర్లకు స్థిర వేతనం నిర్ణయించాలని సీఐటీయూ డిమాండ్



**కరీంనగర్, మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఆశా వర్కర్లకు నెలకు రూ.18 వేల స్థిర వేతనం నిర్ణయించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముకుంద రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మంత్రి పొన్నం ప్రభాకర్ క్యాంప్ కార్యాలయంలో ఆశా కార్యకర్తలతో కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు, పారితోషకాలు చెల్లించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి. సమాన పనికి సమాన వేతనం అందించాలి అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. ఆశా వర్కర్ల న్యాయమైన వేతన డిమాండ్‌ను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని సీఐటీయూ కోరింది.

# ముస్లిం మైనార్టీ సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు





**ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి, ఎమ్మెల్యే వంశీకృష్ణ సందేశాలు**



**నాగర్‌కర్నూల్/అచ్చంపేట, మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బక్రీద్ పండుగ సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని శ్రీపురం రోడ్డులోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి ముస్లిం సోదరసోదరీమణులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ, "ఇస్లాం మతానికి మూల స్తంభాలైన ఈమాన్, నమాజ్, రోజా, జకాత్, హజ్ సూత్రాలను పాటిస్తూ సోదరభావంతో ముందుకు సాగుతూ పండుగలను జరుపుకోవడం హర్షనీయమైన విషయం" అని అన్నారు. ప్రతి ఒక్కరూ సోదరభావంతో బక్రీద్ పండుగను జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, వైస్ చైర్మన్ బాదం రమేష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్, స్థానిక కౌన్సిలర్లు, మత పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అచ్చంపేట పట్టణంలో బక్రీద్ పండుగ సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు, స్థానిక ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ ముస్లిం సోదరసోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనల అనంతరం వారిని కలిసిన ఆయన మాట్లాడుతూ, "త్యాగం, ప్రేమ, దయ, సహనం అనే మహత్తర విలువలను గుర్తు చేసే ఈ పవిత్ర పర్వదినం ప్రతి ఇంటిలో ఆనందం, శాంతి, ఐక్యతను నింపాలి. భగవంతుడి కరుణాకటాక్షాలు అందరిపై ఉండాలి" అని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, తాలూకా ఎస్సీ సెల్ అధ్యక్షులు చింతల రాజగోపాల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రపంచ స్థాయి నగరంగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం





**--ఎఫ్‌సీడీఏ కార్యాలయ పనులపై మంత్రుల సమీక్ష**

**-- జూన్ 2 లేదా 3న ప్రారంభోత్సవానికి సన్నాహాలు**

**కందుకూర్, మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు పనులు వేగంగా కొనసాగుతున్నాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ మరియు సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆయన ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) కార్యాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ఎఫ్‌సీడీఏ కార్యాలయ ప్రారంభోత్సవాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా జూన్ 2 లేదా 3 తేదీల్లో నిర్వహించే అంశంపై త్వరలో నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. ప్రారంభోత్సవానికి ముందుగా పనుల పురోగతిని పరిశీలించేందుకు తాము వచ్చినట్లు చెప్పారు. ఫ్యూచర్ సిటీని ప్రపంచ స్థాయి గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. "ప్రతి కార్యాచరణ గ్లోబల్ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. తమ ప్రభుత్వ హయాంలోనే ఫ్యూచర్ సిటీ నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటాం" అని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే పోలీస్ కమిషనరేట్ ఏర్పాటు దిశగా చర్యలు కొనసాగుతున్నాయని, గ్లోబల్ ప్రెజెన్స్ కలిగిన ప్రభుత్వ కార్యాలయాలను కూడా ఇక్కడి నుంచే నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. యువత నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ప్రత్యేక చట్టం ద్వారా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ నిర్మాణాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా ముందుకు తీసుకెళ్తోందని అన్నారు. "ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఎదురైన ఆటుపోట్లు అధిగమిస్తూ సానుకూల దృక్పథంతో అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. ఫ్యూచర్ సిటీ తెలంగాణకే కాక దేశానికే తలమానికంగా నిలిచే ప్రాజెక్టుగా రూపుదిద్దుకుంటోంది. లక్షలాది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం" అని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం తాత్కాలిక క్యాంపస్‌లో కొనసాగుతున్న యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి శాశ్వత క్యాంపస్ నిర్మాణం వేగంగా జరుగుతోందని తెలిపారు. అనంతరం మంత్రులు యూనివర్సిటీ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌సీడీఏ కమిషనర్ కె. శశాంక, మహేశ్వరం డీసీపీ కె. నారాయణ రెడ్డి, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఘనంగా న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు

**హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా ప్రధాన న్యాయమూర్తుల సమక్షంలో కార్యక్రమం**







**నందికొట్కూరు, మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కర్నూలు ఆదేశాల మేరకు నందికొట్కూరులోని పగిడ్యాల రోడ్డులో గల శ్రీ కాళీ ప్రసాద ఆశ్రీతాశ్రమంలో న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు మరియు ఉచిత వైద్య శిబిరం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ. హరిహర నాదశర్మ, కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. ఖబర్ది హాజరై ఆరోగ్య జ్యోతి ప్రజ్వలన చేశారు. సదస్సులో మాట్లాడుతూ న్యాయమూర్తులు, "పల్లె ప్రియాంక సేవా సమితి ఆధ్వర్యంలో నందికొట్కూరులో ఉచిత వైద్య శిబిరం, న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించడం వలన ప్రజలకు ఆరోగ్యవంతమైన జీవితం లభిస్తుంది. వినికిడి లోపం కలిగిన ప్రత్యేక వ్యక్తులకు పరికరాలు అందించడం గర్వకారణం" అని అభినందించారు. ఈనెల 4వ తేదీన నిర్వహించిన వైద్య పరీక్షలలో వినికిడి లోపం కలిగిన వారికి శ్రీ గురుదేవ్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వినికిడి మెషిన్లు ఉచితంగా పంపిణీ చేశారు. అదేవిధంగా వైటల్ థరెప్యూటిక్స్ అండ్ ఫార్ములేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్లు సర్విశెట్టి వేణుగోపాల్ శెట్టి, సర్విశెట్టి రమేష్ బాబు సుమారు ఐదు లక్షల వ్యయంతో నిర్మించిన 13 కే డబ్ల్యూ పి సోలార్ పవర్ ప్లాంట్ను న్యాయమూర్తులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి, నందికొట్కూరు సీనియర్ సివిల్ జడ్జి ఏ. శోభారాణి, జూనియర్ సివిల్ జడ్జి వి. దివ్య, తహసిల్దార్ శ్రీనివాసులు, వైద్య బృందం డాక్టర్ చైతన్య రెడ్డి, డాక్టర్ శ్వేత, డాక్టర్ కె. నిహారిక, సన్మార్క్ సేవా సమితి అధ్యక్షుడు నాగన్న, పారా లీగల్ వాలంటీర్లు శోభారాణి, చిన్నరాజు, వెంకటేశ్వర్లు, శశి కుమార్, హుస్సేన్ వలి, పారామెడికల్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# అర్బన్ ఛాలెంజ్ ఫండ్‌పై వివాదం



**కరీంనగర్, మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్‌కు 840 కోట్లు మంజూరయ్యాయని కేంద్ర మంత్రి బండి సంజయ్ చేస్తున్న ప్రచారం ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉందని మాజీ కార్పొరేటర్, అడ్వకేట్ ఎ.వి. రమణ విమర్శించారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ మార్గదర్శకాల ప్రకారం కేంద్ర ప్రభుత్వం నేరుగా భరించే మొత్తం కేవలం 25 శాతం మాత్రమేనని, అంటే 840 కోట్లలో సుమారు 210 కోట్లు మాత్రమే కేంద్రం నుంచి గ్రాంట్ రూపంలో వచ్చే అవకాశం ఉందని ఆయన తెలిపారు. మిగతా నిధులు రాష్ట్ర ప్రభుత్వం, మున్సిపల్ సంస్థలు, బ్యాంకు రుణాలు, పీపీపీ ద్వారా సమీకరించాల్సి ఉంటుందని వివరించారు. మొత్తం 840 కోట్లు కేంద్రం ఇచ్చిందని చెప్పడం రాజకీయ ప్రచారం తప్ప మరొకటి కాదు అని రమణ అన్నారు. ప్రాజెక్టు ప్రతిపాదన దశలోనే ఉన్నప్పుడు మంజూరైనట్లు చెప్పడం ప్రజలను మభ్యపెట్టడమేనని విమర్శించారు. ప్రజలకు నిజాలు చెప్పాల్సిన అంశాలుగా కేంద్రం ఇప్పటివరకు విడుదల చేసిన మొత్తం ఎంత? రాష్ట్ర ప్రభుత్వం వాటా ఎంత? రుణాలు, పీపీపీ ద్వారా వచ్చే ప్రయోజనాలు ఏమిటి? ప్రజలపై అదనపు భారం పడే అవకాశం ఉందా? వంటి ప్రశ్నలకు ముందుగా సమాధానం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కరీంనగర్ అభివృద్ధి పేరుతో అంకెల గారడీ చేసి ప్రజలను మోసం చేయడం అంగీకారయోగ్యం కాదని రమణ స్పష్టం చేశారు.

## సీసీ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టిన మంత్రి బండి సంజయ్



**కరీంనగర్ , మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఇరుకుల్ల గ్రామంలో రూ.20 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ కురుమ సంఘ పెద్దలు అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని కోరగా, మంత్రి బండి సంజయ్ హామీ ఇచ్చారు. గ్రామ అభివృద్ధికి అండగా నిలిచినందుకు గ్రామ ప్రజలు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మండల ఎంపీడీవో జగన్మోహన్ రెడ్డి, గ్రామ కార్యదర్శి అభినవ్, సర్పంచ్ రమేష్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షుడు మాడిశెట్టి సంతోష్ కుమార్, ఉపసర్పంచ్ రాకేష్, వార్డు సభ్యులు, బీజేపీ నాయకులు, కురుమ సంఘ పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి కోసం కేంద్ర నిధులు సమకూర్చడంలో మంత్రి బండి సంజయ్ కీలక పాత్ర పోషిస్తున్నారు.

## ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల విశ్వాసం



**పాలకుర్తి, మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పాలకుర్తి మండలం రామారావుపల్లి గ్రామంలో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని ప్రధానోపాధ్యాయుడు యేల్లాల ప్రతాప్ రెడ్డి తెలిపారు. గురువారం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఒక్కరోజులోనే 15 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల నుండి ప్రభుత్వ పాఠశాలలో చేరారని ఆయన పేర్కొన్నారు. పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం, నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులచే నాణ్యమైన బోధన, క్రమశిక్షణ, పరిశుభ్రత వంటి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. గ్రామ ఉపసర్పంచ్ బండి సాగర్ తన ఇద్దరు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ఆదర్శంగా నిలవడంతో గ్రామస్థులు, పాఠశాల సిబ్బంది ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అన్నం లక్ష్మీనారాయణ, వార్డు సభ్యులు రాయిశెట్టి స్వరూప, టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతున్నదని అధికారులు తెలిపారు.

## బక్రీద్ వేడుకలపై సీపీ గౌష్ ఆలం పర్యవేక్షణ



**కరీంనగర్, మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకునేందుకు నగరంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. గురువారం ఆయన స్వయంగా నగరంలోని పలు ప్రాంతాలను పర్యటించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. బుచ్చర్ హౌస్‌లను ఆకస్మికంగా తనిఖీ చేసి నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు, పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు అని హెచ్చరించారు. ప్రధాన చౌరస్తాలు, సమస్యాత్మక ప్రాంతాలను పరిశీలించిన సీపీ, రాత్రి పగలు తేడా లేకుండా పెట్రోలింగ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు పోలీసులకు సహకరించాలి, సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మవద్దు అని ఆయన పిలుపునిచ్చారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు సీపీ గౌష్ ఆలం స్పష్టం చేశారు.

# ఘనంగా జువ్వాడి చొక్కారావు వర్ధంతి కార్యక్రమాలు



**కరీంనగర్, మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ ప్రాంత అభివృద్ధికి విశేష కృషి చేసిన మహానేత స్వర్గీయ జువ్వాడి చొక్కారావు వర్ధంతి కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ప్రజాసేవే లక్ష్యంగా ఎంపీగా పనిచేసిన ఆయన నిరాడంబర జీవితం గడిపి, తెలంగాణ అభివృద్ధి కోసం ఢిల్లీ పెద్దల ముందు గళం విప్పారని నాయకులు గుర్తుచేశారు. నగరంలోని చొక్కారావు సర్కిల్ వద్ద కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్ తదితరులు పాల్గొని చొక్కారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మడుపు మోహన్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, పడిశెట్టి భూమయ్య, వంగల విద్యాసాగర్, కుంభాల రాజు కుమార్, మాదాసు శ్రీనివాస్, గడప శ్రీనివాస్, పెంట శేఖర్, శ్రీరాముల రమేష్, మార్క రాజు, ఖలీల్, కూన దామోదర్, సిరిపురం మనోజ్ తదితరులు పాల్గొన్నారు. చొక్కారావు సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాలు నేటి తరం నాయకులకు ఆదర్శమని నాయకులు పేర్కొన్నారు.

# ఘనంగా బక్రీద్ వేడుకలు





**మానకొండూర్/పెద్దపల్లి, మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
బక్రీద్ పండుగ సందర్భంగా మానకొండూర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు మానకొండూర్ ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ హాజరై ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ బక్రీద్ పండుగ త్యాగం, ప్రేమ, మానవత్వం, సోదరభావానికి ప్రతీక అని, అన్ని మతాల పండుగలు సమాజంలో ఐక్యతకు ప్రతిబింబమని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, మైనార్టీ సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. పెద్దపల్లి పట్టణంలోని చందపల్లి ఈద్గా వద్ద కూడా బక్రీద్ వేడుకలు ఘనంగా జరిగాయి. అలయ్ బలయ్ కార్యక్రమంలో పాల్గొన్న పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణరావు ముస్లిం సోదర సోదరిమణులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ రెండు ప్రాంతాల్లోనూ ముస్లిం మత పెద్దలు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, యువకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పండుగను ఆనందంగా జరుపుకున్నారు. బక్రీద్ పండుగ శాంతి, సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని నాయకులు ఆకాంక్షించారు.

## యాసంగి కొనుగోళ్లపై మంత్రుల సమీక్ష సమావేశం



**పెద్దపల్లి, మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పెద్దపల్లి ఐడిఓసీలో నిర్వహించిన యాసంగి ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్ల సమీక్ష సమావేశంలో పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణరావు, కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ముందుగా పెద్దకల్వల వద్ద కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో యాసంగి కొనుగోళ్లు గత ప్రభుత్వంతో పోలిస్తే 25--30 శాతం అధికంగా జరిగాయని తెలిపారు. ఇప్పటివరకు 58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, 8 లక్షల మంది రైతులకు రూ.11 వేల కోట్లు చెల్లించామని వెల్లడించారు. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా పూర్తి మద్దతు ధరతోనే కొనుగోలు చేసి బాయిలర్ మిల్లులకు తరలిస్తామని, రైతులకు ఎటువంటి నష్టం జరగనివ్వమని హామీ ఇచ్చారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ల కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నామని, అవసరమైతే అదనపు గోదాములు అద్దెకు తీసుకుంటామని తెలిపారు. ఒక్క కిలో ధాన్యానికి కూడా తరుగు పేరుతో కోత విధించలేదని, ఎక్కడైనా తరుగు తీసినట్లు తెలిసినా కఠిన చర్యలు తీసుకుంటాం అని హెచ్చరించారు. విప్ విజయరమణరావు మాట్లాడుతూ ఇతర జిల్లాల నుంచి కూడా పెద్దఎత్తున ధాన్యం పెద్దపల్లికి వస్తోందని, అందుకు అనుగుణంగా రైస్ కేటాయింపులు పెంచాలని కోరారు. చివరి గింజ వరకూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. వర్షానికి తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తాం అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అధికారులు, రైస్ మిల్లర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. మే నెలాఖరులోగా యాసంగి కొనుగోళ్లు పూర్తి చేయాలని మంత్రులు స్పష్టం చేశారు.

# శ్రీనివాసుల సేవా సంస్థ సమక్షంలో మజ్జిగ వితరణ కార్యక్రమం



**కరీంనగర్, మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ పట్టణంలోని మార్కెట్ రోడ్‌లోని వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం మజ్జిగ వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రయాణికులు, భక్తులకు ఉపశమనం కలిగించాలనే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు సభ్యులు తెలిపారు. ప్లాస్టిక్ రహిత కరీంనగర్ నినాదంతో పేపర్ గ్లాస్‌లలో మజ్జిగ పంపిణీ చేశారు. దాదాపు 1500 మందికి పైగా మజ్జిగ అందించగా, సేవా కార్యక్రమాన్ని అభినందిస్తూ ప్రజలు నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక చైర్మన్ పూట్కూరి శ్రీనివాస్ రెడ్డి, గట్టు శ్రీనివాస్, కలికోట శ్రీనివాస్, పెద్ది శ్రీనివాస్, పల్లేర్ల శ్రీనివాస్, పడకంటి శ్రీనివాస్, పైడ శ్రీనివాస్, గాండ్ల శ్రీనివాస్, సామ శ్రీనివాస్, నార్ల శ్రీనివాస్, తొడుపునూరి శ్రీనివాస్, గోనె శ్రీనివాస్, అవధూత శ్రీనివాస్, కోట శ్రీనివాస్, పడమటింటి శ్రీనివాస్, చెన్నాడి శ్రీనివాస్, ఇజ్జగిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తామని సంస్థ సభ్యులు తెలిపారు.

## వర్షం బీభత్సంతో నష్టపోయిన కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నేతలు



**కరీంనగర్ రూరల్, మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలుల ధాటికి బొమ్మకల్‌లో రాజేష్ అనే పేద కుటుంబం తీవ్రంగా నష్టపోయింది. రేకులతో నిర్మించిన ఇంటి పైకప్పు ఎగిరిపోవడంతో ఇల్లు ధ్వంసమై, టీవీ, ఫ్రిడ్జ్ సహా సామాగ్రి చెల్లాచెదురైంది. అదృష్టవశాత్తు ప్రాణాపాయం తప్పింది. విషయం తెలుసుకున్న కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. వెంటనే అధికారులతో మాట్లాడి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం తరఫున అన్ని విధాలా ఆదుకుంటాం అని బాధితులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మొహమ్మద్ పాషా, సింగిల్ విండో వైస్ చైర్మన్ బీరం ఆంజనేయులు, కాంగ్రెస్ నేతలు షాహిద్, దేవేందర్ పటేల్, పెంట శేఖర్, దొంతి గోపి తదితరులు పాల్గొన్నారు. వర్ష బీభత్సంతో నష్టపోయిన కుటుంబానికి కాంగ్రెస్ నేతల పరామర్శ ఊరటనిచ్చింది.

## చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తామని రైతులకు సుడా చైర్మన్ భరోసా



**కరీంనగర్, మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: వరి ధాన్యం చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. నగునూర్ వద్ద కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆయన, ప్రత్యేక గోదాంలను కేటాయించాలని అధికారులను ఆదేశించారు. అకాల వర్షాలు పడ్డా రైతులకు ఎటువంటి నష్టం జరగనివ్వం. వారంలోగా సెంటర్ ఎత్తివేస్తాం అని భరోసా ఇచ్చారు. వాహనాల కొరత, హమాలీల కొరత వల్ల కొంత ఇబ్బంది ఉన్నప్పటికీ రైతులకు నష్టం జరగనివ్వమని నరేందర్ రెడ్డి తెలిపారు. ఇది రైతు ప్రభుత్వం, ప్రతి గింజ కొనుగోలు చేస్తాం అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పెంచాల లక్ష్మణ్ రావు, ఉపసర్పంచ్ హన్మంత రావు, సెంటర్ ఇంచార్జి అజయ్, అశోక్ రెడ్డి, కృష్ణా రెడ్డి, సాయిల్ల రాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు. రైతు పక్షపాతి ప్రభుత్వం అన్న నరేందర్ రెడ్డి మాటలు రైతులకు ఊరటనిచ్చాయి.

## ఈనెల 30, 31 తేదీలలో బీజేపీ శ్రేణుల శిక్షణ తరగతులు



**కరీంనగర్, మే 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**
: కరీంనగర్ జిల్లా బిజెపి శ్రేణుల కోసం పండిత్ దీన్ దయాళ్ ప్రశిక్షణా మహా అభియాన్ పేరిట ఈనెల 30, 31 తేదీలలో రెండు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. తిమ్మాపూర్ మండలం మహాత్మా నగర్‌లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాల వేదికగా ఈ కార్యక్రమం జరగనుంది. జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గురువారం సన్నాహక సమావేశం జరిగింది. పార్టీ శ్రేణులకు సిద్ధాంతపరమైన అవగాహన కల్పించడంతో పాటు కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, బూత్ నిర్వహణ, సోషల్ మీడియా వినియోగంపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఈ తరగతుల ప్రారంభోత్సవానికి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, ముగింపు సమావేశానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ ముఖ్య అతిథులుగా హాజరై దిశానిర్దేశం చేయనున్నారు. పార్టీ శ్రేణులు ఈ తరగతులను విజయవంతం చేయాలని కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. రెండు రోజులపాటు జరిగే ఈ శిక్షణ తరగతులు బిజెపి శ్రేణులకు మార్గదర్శకంగా నిలవనున్నాయి.